శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

వార్త



## వంగవీటి రాధాకృష్ణను ఆహ్వానించిన ఎమ్మెల్యే దగుమాటి



**కావలిరూరల్, జూన్30 ప్రభాతవార్త** కావలి పట్టణ నడిబొడ్డున మాగుంట పార్వతమ్మ ట్రంకు రోడ్డు నందు ఏర్పాటుచేసిన బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, కాపునేత వంగవీటి మోహన్ రంగా కాంశ్య విగ్రహావిష్కరణ కార్యక్రమం జులై 2వ తేదీ జరుగుతుందని ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొనవలసిందిగా వంగవీటి మోహన్‌రంగా తనయుడు వంగవీటి రాధాకృష్ణను కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, కావలి కాపునేతలు, రంగా అభిమానులు విజయవాడలో సోమవారం కలిసి ఆహ్వానించడం జరిగింది. తప్పక విచ్చేస్తానని రాధాకృష్ణ ఎమ్మెల్యే దగుమాటికి హామీనివ్వడం జరిగింది.

## నేడు జెడ్పీలో దిశ సమావేశాలు



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 30, ప్రభాతవార్త** అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశాలు జులై 1న జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరుగుతాయని జిల్లా కలెక్టర్ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 68 పథకాలపై సమీక్షిం చడం జరుగుతుం దన్నారు. ఈ సమావేశాలకు నామినేటెడ్ సభ్యులు, పూర్తి స మాచారంతో ఆయా శాఖల అధికారులు హాజరుకావాలన్నారు.

## గ్రామ సర్వేయర్ల బదిలీల లీల

- సర్వేయర్లు కొంత మంది ఎమ్మెల్యే లెటర్లు తెచ్చుకోవడంతో గందరగోళ పరిస్థితి
- మధ్యాహ్నం నుంచి కొన్ని గంటల పాటు ఆగిపోయిన కౌన్సిలింగ్



**నెల్లూరు అగ్రికల్చర్, జూన్ 30, ప్రభాతవార్త** నెల్లూరు ఆర్డీఓ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న జిల్లా సర్వే, భూమి రికార్డుల కార్యాలయంలో సోమవారం చేపట్టిన సర్వేయర్ల బదిలీల కౌన్సిలింగ్లో గందరగోళ పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ప్రభుత్వం తెచ్చిన ఎస్‌యు నో పోసిషన్‌తో సర్వేయర్లలో ఆందోళన మొదలైంది. దాదాపు 150 మంది వరకు సర్వేయర్లు స్థానిక ఎమ్మెల్యేల లెటర్లు తెచ్చుకున్నారు. జిల్లాలో మొత్తం 299 మంది సర్వేయర్లు ఉండగా 150 మంది వరకు ఎమ్మెల్యేల లెటర్లతో కౌన్సిలింగ్‌కు హాజరైనట్లు తెలిసింది. దీనిపై ఆంధ్రప్రదేశ్ సర్వేయర్ల సంఘం అభ్యంతరం వ్యక్తం చేసింది. అందరికి సమన్యాయం చేయలేనప్పుడు కౌన్సిలింగ్ ఆపాలంటూ ఏపీ సర్వేయర్ల సంఘం నాయకులు కాసేపు ఆందోళన చేపట్టారు. దీంతో మధ్యాహ్నం నుంచి సర్వేయర్ల కౌన్సిలింగ్ ప్రక్రియ కొన్ని గంటల పాటు ఆగిపోయింది. దీనిపై ఆంధ్రప్రదేశ్ సర్వేయర్ల సంఘం జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ మాట్లాడుతూ ఎమ్మెల్యేల లెటర్లు తెచ్చుకున్న సర్వేయర్ల కారణంగా సినియార్టి ఉన్న సర్వేయర్లకు అన్యాయం జరుగుతుందని అన్నారు. మెరిట్ ర్యాంకు ఉన్న వ్యక్తి, ఈ లెటర్ల కారణంగా ఎక్కడో దూర ప్రాంతాలకు వెళ్లవలసిన పరిస్థితి ఏర్పడుతుందని చెప్పారు. దీంతో 2000, 3000 ర్యాంకు ఉన్న సర్వేయర్లకు కూడా అన్యాయం జరుగుతుందని తెలిపారు. ఎమ్మెల్యే లెటర్లు పక్కన పెట్టి అందరికి సమన్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ఏడీ గారితో సంప్రదించామని తాము కలెక్టర్‌తో సంప్రదించి తదుపరి నిర్ణయం తీసుకుంటామని ఏడీ నాగ శేఖర్ తెలియజేశారని చెప్పారు. ఏదీ ఏమైనా ఎమ్మెల్యేల లెటర్లతో పారదర్శకంగా జరగాల్సిన గ్రామ సర్వేయర్ల బదిలీల కౌన్సిలింగ్ పక్కదారి పట్టింది.



## స్పౌస్ పింఛన్లు పంపిణీకి సిద్ధం



**కోవూరు, జూన్30 ప్రభాతవార్త :** కోవూరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలకు సంబంధించి కొత్తగా 490 స్పౌజ్ పింఛన్లును రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. జులై మొదటి వారంలో ఈ పింఛన్లను పంపిణీ చేసేందుకు అధికారులు తగు చర్యలు తీసుకున్నారు. కోవూరు మండలానికి సంబంధించి 113, కొడవలూరు మండలానికి సంబంధించి 75, విడవలూరు మండలానికి సంబంధించి 82, ఇందుకూరుపేట మండలానికి సంబందించి 100 , బుచ్చిరెడ్డిపాలెం అర్బన్ 56, బుచ్చిరెడ్డిపాలెం రూరల్ 64 కొత్త పింఛన్లు మంజూరు కావడం జరిగింది. మొత్తం నూతనంగా మంజూరైన ఈ 490 పింఛన్లను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేసేందుకు సంబంధిత మండల పరిషత్ అధికారులు తగు చర్యలు తీసుకున్నారు. దీందో వితంతువులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## మరో కేసులో పోలీస్ కస్టడీకి కాకాణి

**నెల్లూరు క్రైమ్, జూన్ 30, ప్రభాతవార్త:** పలు కేసుల్లో ముద్దాయిగా ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని పోలీస్ కస్టడీకి ఆదేశిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. కృష్ణపట్నం పోర్టు సమీపంలో అనధికార టోల్గేట్ ఏర్పాటు చేసిన కేసులో రెండు రోజులు పాటు కాకాణిని విచారించేందుకు అనుమతిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ముత్తుకూరు పోలీసుల గోవర్ధన్ రెడ్డిని జిల్లా కేంద్ర కారాగారం నుండి తీసుకొని వెళ్లి పోలీస్ ట్రేనింగ్ సెంటర్‌లో విచారించారు. గతంలో మాదిరిగానే పోలీసుల ప్రశ్నలకు తనకేమీ తెలియదు అన్నట్లు గోవర్ధన్ రెడ్డి సమాధానం ఇచ్చారు. ఇప్పటికే ఐదు కేసుల్లో రిమాండ్‌లో జైలులో ఉన్న కాకాణికి ఒక కేసులో మాత్రం బెయిల్ లభించింది.

## 3వ తేదీ వైయస్ జగన్మోహన్ రెడ్డి పర్యటన

## పర్యటన అడ్డుకునేందుకు అనేక ఆంక్షలు




**నెల్లూరు రూరల్, జూన్ 30, ప్రభాతవార్త** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పర్యటన అడ్డుకునేందుకు అధికారులు సకల ప్రయత్నాలు చేస్తున్నారని ఏది ఏమైనా మూడవ తేదీ జైల్లో శిక్ష అనుభవిస్తున్న మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డిని కలిసేందుకు వైయస్ జగన్మోహన్ రెడ్డి వచ్చేది తధ్యమని తిరుపతి ఎంపీ గురుమూర్తి తెలిపారు. నెల్లూరు జిల్లా వైఎస్ఆర్సిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ ఎమ్మెల్సీ సిటి ఇంచార్జ్ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి రూరల్ ఇన్చార్జి ఆనం విజయకుమార్ రెడ్డి పాల్గొన్నారు ఈ సందర్భంగా తిరుపతి ఎంపీ మాట్లాడుతూ పర్యటన చెడగొట్టేందుకు ప్రభుత్వం అధికారులు డ్రామాలు ప్లే చేస్తున్నారని అన్నారు. ఎప్పటికీ తెలుగుదేశం ప్రభుత్వం ఉండదని అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని లేకపోతే మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. సందర్భంగా మాజీ మంత్రి అనిల్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పర్యటన ఆపాలన్న ఉద్దేశంతోనే మేము చెప్పిన ప్రదేశాలలో నిర్ణయించలేదని అన్నారు. ప్రభుత్వం భయపడే ఈ పర్యటన అడ్డుకుంటుందని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి నెల్లూరు రాకపై అనేక ఆంక్షలు విధిస్తున్నారు. ఈ పద్ధతి కరెక్ట్ కాదని అన్నారు. సాధ్యం కానీ విధానాన్ని అధికారులు చెబుతున్నారని అన్నారు. ఎలిప్యాట్ దిగే అవకాశం లేని ప్రాంతాన్ని అధికారులు చూపించాడం పై అసహనం వ్యక్తం చేశారు. పర్యటనలో పాల్గొనే వారి పేర్లు ఇవ్వమని చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. కమీషన్లు పెట్టిన మూడో తారీకు జగన్ మోహన్ రెడ్డి వచ్చేది ఖాయమని ఆయన తెలిపారు.

## డిఆర్ఓ ఉదయ భాస్కరరావు బదిలీ



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 30, ప్రభాత వార్త** నెల్లూరు జిల్లా జిల్లా రెవెన్యూ అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఉదయ భాస్కరరావు ప్రభుత్వ బదిలీల్లో భాగంగా, నెల్లూరు నుండి బదిలీ అయ్యారు. విజయవాడ సి సి ఎల్ ఏ అసిస్టెంట్ సెక్రటరీ గవర్నమెంట్, తిరుపతయ్య పదవి విరమణ అవడంతో ఆయన స్థానంలో ఉదయ భాస్కరరావు బాధ్యతలు స్వీకరించనున్నారు.

## నాణ్యత ప్రమాణాల మేర పారిశుధ్య పనులు



- రాష్ట్రష పట్టణ, పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ
- 45 డివిజన్లోని పూడికతీత పనులను పరిశీలించిన మంత్రి
- వర్షాకాలం దృష్ట్యా 6.7 కిలోమీటర్ల కాలువలు శరవేగంగా పూడిక తీత పనులు
- గత ప్రభుత్వంలో మున్సిపల్ శాఖకు చెందిన 3 వేల కోట్లు పక్కదారి పట్టించారని ఆగ్రహం వ్యక్తం చేసి మంత్రి



**నెల్లూరు, జూన్ 30, ప్రభాతవార్త-వైద్యం** నెల్లూరు45వ డివిజన్ పొగతోటలో కాలువ పూడిక తీత పనులను రాష్ట్ర పురపాలక పట్టణాభి వృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పరిశీలించారు. నాణ్యత ప్రమాణాల మేర పారిశుధ్య పనులను చేపట్టాలని సిబ్బందికి సూచించారు. మున్సిపల్ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. మురికి ప్రదేశాల్లో, చెత్త పేరుకుపోయిన ప్రాంతాల్లో మంత్రి నారాయణ స్వయంగా నడిచి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మాట్లాడుతూ మున్సిపాలిటీలలో తాగునీరు, చెత్త తొలగింపు, పూడిక తీత పనులు ముఖ్యమైనవన్నారు. వాటికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రాష్ట్రంలో డ్రైన్స్ పనులన్నీ త్వరలో పూర్తి చేస్తామన్నారు. ప్రతి ఇంటికి స్వచ్ఛమైన మంచినీటిని అందిస్తామని చెప్పారు. అక్టోబర్, నవంబర్ నెలల్లో నెల్లూరులో వర్షాలు కురుస్తాయన్నారు. 6.7 కిలో మీటర్ల పరిధిలోని కాలువలన్నింటిలో పూడిక తీత పనులు ప్రారంభించామని తెలిపారు. పదిహేను రోజుల్లో పనులు పూర్తి అవుతాయన్నారు. గత ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసి వెళ్లిందని మండిపడ్డారు. పది లక్షల కోట్లు అప్పు రాష్ట్రానికి మిగిల్చి వెళ్లారని దుయ్యబట్టారు. మున్సిపల్ శాఖకు చెందిన 3వేల కోట్లను పక్కదారి పట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి అనుభంతో పరిస్థితులు దాడిలో పడుతున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ ఆపేసిన అభివృద్ధి పనులన్నీ తిరిగి ప్రారంభిస్తామన్నారు. కొద్దిగా ఓపిక పడితే హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. అంతర్జాతీయ ప్రమాణాలతో పేద పిల్లల కోసం సిద్ధమైన వీఆర్ హైస్కూల్‌లో ఈ రోజు నుండి తరగతులు ప్రారంభిస్తున్నా మన్నారు. అనంతరం నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని మంత్రి నారాయణ ముందస్తు చర్యలు చేపట్టారన్నారు. 40 కాలువల్లో పూడిక తీత పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. రాజధాని నిర్మాణంలో బిజీగా ఉన్న సిటీ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతున్నారు. మున్సిపల్ కమీషనర్ నందన్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్ళపా క అనురాధ, నగర పార్టీ అధ్యక్షులు మామిడాల మధు, డివిజన్ క్లస్టర్ అజయ్, కో క్లస్టర్ డాక్టర్ పోకల రవి, ప్రెసిడెంట్ సుజన్, కార్పొరేటర్లు, టీడీపీ ముఖ్య నేతలు, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

## వీఆర్ హైస్కూల్‌కు అంతర్జాతీయ ప్రమాణాలతో డిజిటల్ విద్య

- ఏడో తేదీన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ప్రారంభం
- రాష్ట్రష పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ
- వీఆర్‌సీలో ప్రైమరీ తరగతులను ప్రారంభించిన మంత్రి
- తల్లిదండ్రులు, పిల్లలతో కోలాహాలంగా మారిన వీఆర్సీ పాఠశాల
- థాంక్యూ నారాయణ సార్ అంటూ గట్టి నినాదాలు చేసిన విద్యార్థులు



**నెల్లూరు, జూన్ 30, ప్రభాతవార్త-వైద్యం** నెల్లూరు వీఆర్ హైస్కూల్‌కు పూర్వ వైభవం వచ్చింది. ఎటు చూసినా విద్యార్థులు వారి తల్లిదండ్రులతో సందడి సందడి వాతావరణం నెలకొంది. అంతర్జాతీయ ప్రమాణాలతో డిజిటల్ విద్య అందించేందుకు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆధ్వర్యంలో సర్వం సిద్ధం చేశారు. గ్రామంలో సోమవారం అట్టహాసంగా వీఆర్ హైస్కూల్లో ప్రైమరీ తరగతులను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. తొలి రోజు చిన్నారులతో పాటు వీఆర్సీ కి వచ్చిన తల్లిదండ్రులతో సందడి వాతావరణం నెలకొంది. వీఆర్ హైస్కూల్లో ఏర్పాటు తరగతి గదులు డిజిటల్ విధానం, క్లాస్ రూమ్స్, ప్లే గ్రౌండ్ చూసి విద్యార్థులు తల్లిదండ్రులు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. థాంక్యూ నారాయణ సారా అంటూ వారంతా నినాదాలు చేశారు. ఆజన్మాంతం రుణపడి ఉంటామంటున్న పేద తల్లిదండ్రులు మంత్రి నారాయణ ఎదుట భావోద్వేగానికి గురాయ్యరు. ఈ క్రమంలో విద్యార్థులను మంత్రి నారాయణ ఎంతో ఆప్యాయంగా పలకరించారు. తరగతి గదులన్నింటిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డ్టార్ పొంగూరు నారాయణ మాట్లాడుతూ అంతర్ జాతీయ ప్రమాణాలతో సిద్ధమైన వీఆర్సీ భవనాలను, ప్లేగ్రౌండ్‌ని అధికారికంగా ఏడో తేదీన రాష్ట్ర విద్యశాఖ మంత్రి నారా లోకేష్ ప్రారంభిస్తారని తెలిపారు. నర్సరీ నుండి ఐదో తరగతి వరకు ఈ రోజు తరగతులు ప్రారంభించామన్నారు. ఆరు నుండి తొమ్మిదో తరగతి వరకు ఎల్లుండి నుంచి స్టార్ట్ చేస్తామని తెలియజేశారు. తాను చదివిన వీఆర్ హైస్కూల్‌ని అద్భుతంగా తీర్చిదిద్దేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. శ్రమించిన నా పిల్లలు, ఎన్సీసీ కంపెనీ సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తొలి రోజు స్కూల్‌కి వచ్చిన పిల్లలు, వారి తల్లిదండ్రులు ఆనందం చూస్తుంటే సంతోషంగా ఉందన్నారు. ఈ రోజు నాకు చాలా సంతృప్తిగా ఉందని మంత్రి హర్షం వ్యక్తం చేశారు. వీఆర్సీ తరహాలో మరో రెండు స్కూల్స్‌ని సిద్ధం చేసేందుకు డీఎస్ఆర్ కంపెనీ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఉన్నత స్థితిలో ఉన్న నెల్లూరు వాసులు స్కూల్స్ ఆధునీకరణకు పీ4 ద్వారా ముందుకు రావాలని మంత్రి పిలుపునిచ్చారు. వేలాది మంది పేద పిల్లల భవిష్యత్తుకు సహకరించాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, మున్సిపల్ కమీషనర్ నందన్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్ళపాక అనురాధ, నగర పార్టీ అధ్యక్షులు మామిడాల మధు, డివిజన్ క్లస్టర్ అజయ్, కో క్లస్టర్ డాక్టర్ పోకల రవి, ప్రెసిడెంట్ సుజన్, కార్పొరేటర్లు, టీడీపీ ముఖ్య నేతలు, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 480 అర్జీలు

- మధ్యాహ్నం మూడు గంటల వరకు సాగిన పి జి ఆర్ ఎస్
- అర్జీలను సకాలంలో పరిష్కరించాలి కలెక్టర్ ఆనంద్
- దివ్యాంగులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేసిన జేసీ కార్తీక్



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 30, ప్రభాతవార్త** ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజలు అందిస్తున్న అర్జీలను జాప్యం లేకుండా సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ఆనంద్ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ ఆనంద్ ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జేసీ కార్తీక్, డిఆర్వో ఉదయభాస్కర్‌రావు, డిఆర్‌డిఎ పిడి నాగరాజకుమారి, జడ్పీ సిఇవో మోహన్‌రావు అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను వెంటనే పరిష్కరించేందుకు ఆయాశాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా భూసమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు. ప్రతి అర్జీని కూడా క్షుణ్ణంగా పరిశీలించి ప్రజలు సంతృప్తి చెందేలా నిర్దిష్ట గడువులోగా నాణ్యమైన పరిష్కారం చూపించాలని, పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేక పోతున్నారో అర్జీదారులకు వివరించాలన్నారు.

**ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 480 అర్జీలు** ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 480 అర్జీలను ప్రజలు అందజేశారు. వీటిలో ఎక్కువగా రెవెన్యూశాఖకు సంబంధించి 186, మున్సిపల్‌శాఖకు సంబంధించి 36, సర్వేకు 48, పంచాయతీరాజ్‌శాఖకు 35, పోలీసుశాఖకు 52, సివిల్ సప్లయిస్‌కు విభాగానికి సంబంధించి 14 అర్జీలు అందాయి. ఈ అర్జీలపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ నిర్దిష్ట గడువులోగా అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.



**దివ్యాంగులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ** దివ్యాంగులకు జాయింట్ కలెక్టర్ కార్తీక్ ల్యాప్‌టాప్‌లను అందించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 11మంది దివ్యాంగులకు 11 ల్యాప్‌టాప్‌లను అందించారు. ఒక్కొక్క ల్యాప్‌టాప్ సుమారు 42వేలు రూపాయలు కాగా మొత్తం 4.62లక్షల విలువైన ల్యాప్‌టాప్‌లను అందించారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో ఉదయభాస్కర్ రావు, కలెక్టరేట్ ఎవో విజయకుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ మహ్మద్ అయూబ్, సూపరింటెండెంట్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

## దుత్తలూరులో దారుణం... అత్త,మామలను హత్యచేసిన అల్లుడు

### అత్తమామలను కత్తితో నరికిన మానవమృగం

### భార్యపైకూడ దాడి... పోలీసులు విస్తృత గాలింపులు



**దుత్తలూరు, జూన్30, ప్రభాతవార్త :** కన్న తల్లి, దండ్రుల్లా చూసుకోవలసిన అల్లుడే మానవమృగంగా మారి స్వయాన పిల్లనిచ్చిన అత్తమామలపై కత్తితో దాడిచేసి హతమార్చిన సంఘటన మండలకేంద్రమైన దుత్తలూరు ఎసి కాలనీలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల మేరకు చలంచర్ల కల్లయ్య (65), జయమ్మ (60) అనే దంపతులు తన కుమార్తె అంకమ్మను అదే కాలనీకి చెందిన ఏలూరి వెంగయ్యకిచ్చి వివాహం చేశారు. వారికి ముగ్గురు సంతానం. అయితే వారు కూలినాలి చేసుకొని జీవనం సాగించేవారు. మద్యానికి బానిసైన వెంగయ్య తొలినుంచి భార్యను వేదింపులకు గురిచేసేవాడని కుటుంబసభ్యులు బంధువులు పలుమార్లు హెచ్చరించిన అతనిలో ఏమాత్రం మార్పు రాలేదు. ఈ తరుణంలో ఆదివారం కాలనీలోని కొంతమందితో కలసి అంకమ్మ సమీప గ్రామంలోని చెరువువద్దకు చేపల వేటకు వెళ్ళింది. తిరిగి ఆమె ఇంటికి రాగ తనను అడగకుండ ఎందుకు చేపలవేటకు వెళ్ళావంటూ అతను వాదనకు దిగాడు. ఈనేపద్యంలో ఇరువురు మద్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో ఆవేశానికి గురైన అతను బజారుకు వెళ్ళి మద్యంసేవించి నివాసానికి చేరుకున్నాడు. ఆసమయంలో భార్య ఇంటివద్ద లేక పోవడంతో కోపోద్రికుడై ఇంట్లోవున్న కత్తిని తీసుకొని తన భార్యగూర్చి ఆరాతీస్తు అత్త,మామల ఇంటికి వెళ్ళిందని తెలుసుకొని ఆవేశంతో అక్కడకి వెళ్ళి భార్యపై ఒక్కసారిగ కత్తితో దాడికి పల్పడ్డాడు. ఆసమయంలో అక్కడేవున్న అత్త, మామలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీనంతటికి కారణం మీరేనంటు వారిపైనకూడ విచక్షణారహితంగ దాడికి పాల్పడడంతో ఇరువురు అక్కడికక్కడే రక్తపు మడుగులో పడి మృతిచెందారు. భార్యసైతం తీవ్ర గాయాలతో భయాందో ళణకు గురై ఆమె అక్కడనుంచి పరుగులు తీసింది. ఆపై అత్త,మామలు మృతిచెందారని నిర్ధారించుకున్న అతను ఎవ్వరికి కనపడకుండ కత్తితో అక్కడనుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ ఆదిలక్ష్మి సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన అంకమ్మను చికిత్సనిమిత్తం ఉద యగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతదేహాల్ని సైతం వైద్యశాలకు తరలించారు. అనంతరం కేసు నమొదు చేసి దర్యాప్తు చేస్తుండడంతో పాటు నిందితుడికోసం గాలింపు చర్యలు చేపట్టారు. సంఘటన స్థలాన్ని ఉదయగిరి సిఐ వెంకట్రావు పరిశీలించారు. ఈ నేపద్యంలోకాలనీలో విషాచాయలు అలుముకున్నాయి.

## తమ కాలనీ నుంచి పాఠశాల తరలించవద్దని వినతి



**సైదాపురం, జూన్ 30, ప్రభాతవార్త** : మండల పరిధిలోని పోతేగుంట గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలను కాలనీ నుంచి తరలించవద్దని గ్రామ ప్రజలు గ్రీవెన్స్‌డే సందర్భంగా తహశీల్దార్ ఎం.సుభద్ర, మండల విద్యాశాఖ అధికారి దయాకం రావుకు సర్పంచ్ కుమ్మరిగుంట బుజ్జమ్మ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా మా కాలనీలో ప్రాథమిక పాఠశాల ఉందని, ప్రస్తుతం ఈ పాఠశాలలో 28 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. అయితే ప్రస్తుం 1,2 తరగతులు, 3,4,5 తరగతుల నుంచి సుమారు 18 మంది పిల్లలను ఊర్లో ఉన్న పాఠశాలకు పంపమంటున్నారని అన్నారు. కానీ మా కాలనీ నుండి ఊర్లో ఉన్న స్కూల్‌కు సుమారు ఒక కిలో మీటర్ దూరం ఉంటుందని, ఈ మార్గం మాగాణి మధ్యలో ఉండటంతో బావులు, సోలార్ లైన్‌లు తీసి ఉందని వారు తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలం ఈ రోడ్డు నందు విషపూరితాలు తిరుగుతాయని, కావున ప్రమాదం కలిగే ఇబ్బంది ఉన్నందున తమ పిల్లలను ఊర్లో ఉన్న స్కూల్‌కి పంపించలేమని వారు తెలిపారు. కావున అధికారులు స్పందించి స్కూల్ తరలించవద్దని వారు విన్నవించారు.

## విద్యార్థులకు 12 వేలు విలువ చేసే బుక్స్ బహుకరించిన దొడ్ల కోదండరామిరెడ్డి



**బుచ్చి జూన్ 30 ప్రభాతవార్త** : బుచ్చిరెడ్డిపాళెం శ్రీగోపాలకృష్ణయ్య పాఠశాలలో చదివే ప్రతభ గలిగిన,ముగ్గురు విద్యార్థులకు దాత దొడ్ల కోదండరామిరెడ్డి ఈ సంవత్సరానికి కావాలసిన 12000 విలువ చేసే వర్క్ బుక్స్ టెక్స్,బుక్స్ అందజేశారు.ఈ సందర్బంగా విద్యార్థులను అభినందించారు. బాగా చదువుకొని మంచి పేరు తేవాలని కోదండరామిరెడ్డివిద్యార్థులను ఆశీర్వదించారు. ఈ సందర్బంగా పాఠశాల కరస్పాండెంట్ నేలనూతల శ్రీదర్ , కోదండరామిరెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. నేలనూతల శ్రీదర్, ప్రిన్సిపల్ సురేక, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోటిబుక్స్, విద్యాసామాగ్రి పంపిణి




**బుచ్చి జూన్ 30 ప్రభాతవార్త** : బుచ్చిరెడ్డిపాళెం సహారా ఎడ్యుకేషనల్ రూరల్ డవలప్‌మెంట్ సొసైటీ వారి ఆధ్వర్యంలో రెడ్డిపాళెం గ్రామంలోని ఎంపిపి ఎస్ గిరిజన పాఠశాల నందు చదువుతున్న బాల బాలికలకు పలకలు, నోటి బుక్స్, పెన్నులు, పెన్సిల్స్,రబ్బర్లు, పంపీణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎంఇఒ 2 , పి .రత్నం, పాల్గొ న్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు పిల్లలను తప్పకుండా ప్రతి రోజు బడికి పంపించాలని అన్నారు. ప్రభుత్వం మీ పిల్లలకు అన్ని విధాల సహాయసహాకారాలు అందిస్తుందని అన్నారు. తల్లికి వందనం కూడా ఇస్తుందని ఆయన తెలిపారు. సొసైటీ అద్యక్షులు యస్దాని బాషా మాట్లాడుతు మేము మా సంస్ద ద్వారా ప్రతి సంవత్సరం పేద ప్రజలకు ప్రభుత్వ పాఠశాలలో చదువు విద్యార్థులకు నోటిబుక్స్ పెన్సిల్స్ వంటివి అందజేస్తామని అన్నారు. దాత సహకారంతో ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ఈకార్యక్రమానికి సహాయం చేసిన కౌన్సిలర్ యానాదిరెడ్డికి యజ్దాని బాషా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గిరిజాకుమారి, పాఠశాల ఉపాధ్యాయులు,వేణుగోపాల్, సొసైటీ సభ్యులు,పఠాన్ రహమత్తుల్లా పాల్గొన్నారు.

## శ్రీనివాసులురెడ్డి సేవలు అభినందనీయం



**బుచ్చి జూన్ 30 ప్రభాతవార్త** : 28 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో అంకిత భావంతో పనిచేసి ఎంతో మంది విద్యార్థు లబంగారు భవితకు వారి అభ్యున్నతికి బాట లు వేసిన దోర్నాదుల శ్రీనివాసులురెడ్డి సేవలు ప్రశంసనీయమని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యా యురాలు సుజాత ప్రశంసించారు. ఇటువంటి ఉపాధ్యాయుల్ని ఆదర్శంగా తీసుకొని నేటి తరం ఉపాధ్యాయులు ముందుకు వెళ్ళాని అన్నారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువాలు కప్పి పూలమాలలు వేసి సత్కరించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 2 నుండి 4 వరకు మహిళా సర్పంచులకు శిక్షణ



**బుచ్చి జూన్ 30 ప్రభాతవార్త** : ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నెల్లూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈనెల 2 వ తేది నుండి 4 వ తేది వరకు మూడు రోజులు పాటు బుచ్చిరెడ్డిపాళెంకి చెందిన 7 మంది మహిళా సర్పంచులకు స్దానిక స్వపరిపాలనలో మహిళా సాధికారత,గ్రామణాభివృద్ది దిశ మార్పుపై అవగాహన నిమిత్తం శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎండిఒ ఎం.నారాయణరెడ్డి తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమానికి తప్పనిసరిగా అందరు మహిళా సర్పంచులు హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## రోడ్డెక్కిన కర్రేడు మహిళల ఆందోళనను గౌరవించండి

**– భూములు తీసుకుంటే జీవన ఉపాధిని శాశ్వతంగా కోల్పోతారు**
**– బిజెపి నేత మిడతల రమేష్ జిల్లా కలెక్టర్‌కు వివరణ**



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 30, ప్రభాతవార్త** : ఇండోసోల్ కంపెనీకి వ్యవసాయంపై ఆధారపడిన రైతులు ఇండోసోల్‌కు భూములు అప్పగిస్తే జీవనోపాధికి ప్రత్యామ్నాయ భూములు లేవు అని బిజెపి నేత మిడతల రమేష్ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఇండోసోల్ కొరకు భూసేకరణ జరిపే కరేడులో చిన్నపాటి బీసీ కులాల రైతులే పంటలు సాగు చేస్తున్నారు అని ఉలవపాడు మామిడి సపోటాలకు ప్రత్యేకమైన బ్రాండ్ ఇమేజ్ ఉంది చిన్న సన్న కారు రైతులకు జీవనాధారమైన భూములు ప్రభుత్వం తీసుకుంటే వ్యవసాయం లేని గ్రామంగా కరేడు మారుతుంది. ప్రభుత్వం ఎంత పరిహారం ఇచ్చిన తల్లి లాంటి గ్రామాన్ని విడిచి రైతులు వలసలు వెళ్ళి జీవించాల్సి ఉంటుంది నష్టపోతామని మహిళలు రోడ్డెక్కి చేసిన ఆందోళనలో వారి బాధలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. నామమాత్రపు పబ్లిక్ హీరింగ్ చేపట్టవద్దు. మహిళలు సంతృప్తి చెందాల నిర్ణయాలు తీసుకోవాలి. మహిళల ఆందోళనకు మద్దతునిస్తున్నాం. బలవంతపు భూసేకరణను వ్యతిరేకిస్తున్నామని రమేష్ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రఘురామయ్య, నరాలు సుబ్బారెడ్డి, వెంకటేష్, పద్మావతి, నారాయణ, సూర్యనారాయణ, ఏవి సుబ్బయ్య, లక్ష్మణరావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన పేదవాళ్ళందరికి ఇళ్లు మంజూరు చేయాలి



**చేజర్ల జూన్ 30 ప్రభాతవార్త** : ప్రధానమంత్రి ఆవాస యోజన పథకం కింద ఇల్లు లేని ప్రతి పేదవాడికి ఇల్లు మంజూరు చేయాలనిచేజర్ల మండల బిజెపి నాయకులు కోరారు.ఈ సందర్బంగా సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యాక్రమంలో భాగంగా ఎంపిడిఒ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఆవినతి పత్రంలో మండలంలో ప్రధాన మంత్రి ఆవాస యోజన పథకం కింద 9 వందల ఇండ్లకు ధరఖాస్తు చేసుకున్నారని అన్నారు.అందులో 6 వందల మందికి పోజిషన్ సర్టిఫికేట్లు ఇవ్వకుండా నిరాకరించారని 3 వందల మందికే అర్హులుగా తేల్చడంఏమిటని ప్రశ్నించారు. మిగిలిన లబ్దిదారులకు రెవిన్యూ హౌసింగ్ అధికారులు ఒకరి మీద ఒకరు సాకలు చెప్పుకుంటు నిర్లక్ష్యం గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరాకరించిన జాబితాలను అధికారులు ఇవ్వమంటే ఇవ్వడం లేదనిఈ విషయంపై జిల్లా అధికారుల దృష్టికి తీసుకొని వెళతామని వినతి పత్రంలో తెలియజేశారు.ఈకార్యక్రమంలో బిజెపి నాయకులు జిల్లా ఉపాధ్యాక్షులు బత్తల కృష్ణయ్య ,కిసాన్ మోర్చ రాష్ట్ర నాయకులు కుంకు బాలయ్యానాయుడు,జగ్గారెడ్డి, తెల్లపాటి రామానాయుడు, కోటేశ్వర్‌రెడ్డి, ఒర్సు పెంచలయ్య, తదితర బిజెపినాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆత్మహత్య చేసుకుని వ్యక్తి మృతి



**సైదాపురం, జూన్ 30, ప్రభాతవార్త** : కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్థాపానికి గురై ఓ వ్యక్తి ఊరేసుకుని మృతిచెందిన సంఘటన సైదాపురంలో చోటు చేసుకుంది. ఎస్సై కాంతి కుమార్ వివరాల మేరకు సైదాపురంలో ఎస్సీ కాలనీకి చెందిన కాకాణి వెంకట రమణయ్య(38) తండ్రి పురుషురాం. అదే గ్రామానికి చెందిన భాగ్యలక్ష్మీ అనే మహిళను 17 సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు మగ పిల్లలు జన్మించగా వారిలో ఒకరు అనారోగ్యంతో మృతి చెందాడు. ఇటీవల వెంకటరమణయ్య దంపతులు ఇల్లు కట్టి అప్పులు అవడంతో వాటిని తీర్చేందుకు కువైట్‌కు వెళ్లి ఈనెల 22వ తేదీన సైదాపురంకు వచ్చాడు. వచ్చినప్పటి నుండి భార్యభర్తలు తరచుగా గొడవలు పడుతుండటంతో మనస్థాపానికి గురై కటన్ గుడ్డతో ఫ్యాన్‌కు ఉరేసుకుని వెంకటరమణయ్య మృతి చెందాడు. మృతుడి తల్లి లక్ష్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కాంతి కుమార్ తెలిపారు.

## దివ్యాంగులను రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించాలి

**– వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆవుల నాగేంద్ర డిమాండ్**



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 30, ప్రభాతవార్త** : స్థానిక సంస్థల ఎన్నికలలో దివ్యాంగులకు అన్ని స్థాయిలలో, నామినేటెడ్ హోదాలలో, రాజ్యాధికారములో భాగస్వామ్య దిశగా రాష్ట్ర ప్రభుత్వం కూటమి ప్రభుత్వం చొరవ చూపి చట్టసవరణను చేసి భాగస్వామ్యం కల్పించాలి అని వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. దివ్యాంగులుగా పుట్టిన ఈ సమాజంలో జీవించడానికి ఆర్థికంగా, వివక్షతగా, నిర్లక్ష్య వైఖరితో ఇబ్బందులకు గురౌతున్నారు. 21 రకాల వైకల్యాలుగా ఉండే 25 లక్షల దివ్యాంగుల జనాభా వారి కుటుంబాలతో కలిపి మొత్తం కోటికి పైగా ప్రభావితం కలిగిన సామాజిక వర్గం. ప్రస్తుత పరిస్థితులలో దివ్యాంగుల తలరాతలను, దివ్యాంగులే మార్చుచేసుకునే దిశగా అడుగులు వేస్తున్నాం. ఏ రాజకీయ పార్టీలు అయినా దివ్యాంగులను జాలి, దయ కోణంలో చూస్తున్నారే తప్ప ఆత్మగౌరవం, హక్కులు, రాజ్యాధికారంలో భాగస్వామ్య దిశగా ఆలోచనలు చేయకుండా దివ్యాంగుల సమాజాన్ని గాలికి వదిలేశారు. భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా బీ జే పీ ప్రభుత్వం దివ్యాంగుల కొరకు 2016 వికలాంగుల హక్కుల చట్టాన్ని రూపొందించి, అన్ని రాజకీయ పార్టీల సహకారంతో పార్లమెంట్లో చట్టసవరణలు చేసి ఆమోదించి అన్ని రాష్ట్రాలలో అమలు చేయాలని ఆదేశాలిచ్చినా ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ఎక్కడ వేసి గొంగలి అక్కడే ఉంది. దివ్యాంగులకు విద్యా, వైద్యం, ఉపాధి, రక్షణ రంగాలలో పెద్దపీట వేశారు. ధన్యవాదాలు. దివ్యాంగుల సమస్యల అన్నియు రాజకీయ క్షేత్రంతో ముడిపడి ఉంది, కనుక దివ్యాంగలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం దిశగా చట్ట సవరణలు చేసి ఉంటే ఇప్పుడు అన్ని రాష్ట్రాలలో అమలు జరిగి ఉండేది. క్యాలెండర్లలో సంవత్సరాలు మారుతున్నా దివ్యాంగుల జీవితాలలో ఎటువంటి మార్పులు జరగడంలేదు.కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలో పంజాబ్, ఛత్తీస్గడ, రాజస్థాన్ ప్రక్క రాష్ట్రమైన తమిళనాడులో దివ్యాంగుల కోసం చట్ట సవరణలు చేసి అవకాశాలను కల్పించడం జరిగింది. అందువల్ల మా అభ్యర్ధనను పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వానికి ఒక్క పైసా ఖర్చు లేకుండా చట్ట సవరణలు చేసి దివ్యాంగులను రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించగలరని విజ్ఞప్తి చేసారు.

## పాత కక్షలు మనసులో పెట్టుకుని వ్యక్తిపై దాడి

**తోటపల్లిగూడూరు, జూన్ 30, ప్రభాతవార్త** : తోటపల్లిగూడూరు మండలంలోని చింతోపు గ్రామానికి చెందిన లేబూరు బాలాజీ అనే వ్యక్తి పాత కక్షలు పెట్టుకుని ఆదివారం సాయంత్రం బాలాజీ స్నేహితులతో కలిసి అదే గ్రామానికి చంఎదిన ఎండ్లూరు నరేంద్ర అనే వ్యక్తిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని తోటపల్లిగూడూరు పోలీసులు తెలిపారు. ఈ విషయమై తోటపల్లిగూడూరు ఎస్సై వీరేంద్రబాబుకు అందిన సమాచారం మేరకు నరేంద్రపై దాడి చేసిన బాలాజీ మస్తాన్ సమీర్ షాజిద్ అనే వ్యక్తులను నరుకూరు సమీపంలోని కౌస్తుభం ఎస్టేట్ వద్ద ఉన్నారన్న సమాచారంతో వెళ్లి ముద్దాయిలను అదుపులోకి తీసుకుని విచారించి వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తోటపల్లిగూడూరు పోలీసులు పత్రికా ప్రకటనలో తెలిపారు.

## రామసుబ్బారెడ్డికి నివాళులర్పించిన సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



**మనుబోలు జూన్ 30 ప్రభాతవార్త** : మనుబోలు మండలంలోని చెర్లోపల్లి గ్రామ సీనియర్ టిడిపి నాయకులు కలికి వేణుగోపాల్‌రెడ్డి అన్న కలికి రామ సుబ్బారెడ్డి అనారోగ్యంతో ఆదివారం రాత్రి కన్ను మూశారు. సమాచారం తెలుసుకున్న సరే ్వపల్లి నియోజకర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త సోమి రెడ్డి రాజగోపాల్‌రెడ్డి సోమవారం రామసుబ్బారెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తమ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయనతోపాటు మండల అధ్యక్షులు పొన్నూరు రామకష్ణయ్య పొన్నూరు అశోక్ సుమన్ తేజ శివుడు రాజా గౌడ్ మోపూరు ధనుంజయరెడ్డి సాని వెంకట రామయ్య తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## దేవిరెడ్డి శారద ట్రస్టు సేవలు అభినందనీయం



**అల్లూరు, జూన్ 30 ప్రభాతవార్త:** రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ట్రస్టులోని హైస్కూల్, ఆసుపత్రి, స్కిల్ డెవలప్‌మెంటు సెంటర్‌ను సందర్శించిన మంత్రి నారాయణ. ఇదే తరహాలో నెల్లూరు నగరంలోని మున్సిపల్ పాఠశాలల అభివృద్ధికి కృషి. మూలపేట బాలికల పాఠశాలను దత్తత తీసుకున్న డిఎస్ఆర్‌కు ధన్యవాదాలు. ఈనెల 7న మంత్రి లోకేష్‌చే విఆర్ హైస్కూల్ ప్రారంభోత్సం, మూలాపేట బాలికల హైస్కూల్ ఆధునీకరణ పనులకు శంకుస్థాప దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ప్రశంసించారు. సోమవారం అల్లూరులోని డిఎస్ఆర్ ట్రస్టు



ప్రాంగణంలోని హైస్కూల్, ఆసుపత్రి, స్కిల్ డెవలప్ మెంటు సెంటర్‌ను మంత్రి సందర్శించారు. ఈ సందర్బంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ దేవిరెడ్డి శారదా ట్రస్టు నిర్వాహకులు దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి, దశరధరామిరెడ్డి, ప్రభా ాకర్‌రెడ్డి విద్య, వైద్యం పేదలకు చేరువ చేయడంలో విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. అల్లూరు మండలంలోని పేద విద్యార్థులకు ఉచితంగా విద్యను అందిస్తున్నారని, వసతి సౌకర్యం కూడా కల్పిస్తున్నారన్నారు. ఇక్కడ సుమారు 400 నుంచి 500 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, అత్యాధునిక వసతులైన కంప్యూటర్ ల్యాబ్స్, తరగతి గదులు చాలా బాగున్నాయని కితాబిచ్చారు. ఇదే తరహాలో నెల్లూరు నగరంలోని 54 మున్సిపల్ పాఠశాలలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతోనే డిఎస్ఆర్ ట్రస్టును సందర్శించినట్లు చెప్పారు. ఎక్కడెనా బాగుంటే చూడడం దానిని ఆచరించడం తన విధానంగా మంత్రి చెప్పారు. అలాగే దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి నెల్లూరు నగరంలోని మూలాపేట బాలికల హైస్కూల్‌ను అభివృద్ధి చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. మూలాపేట బాలికల హైస్కూల్‌లో 14 తరగతి గదులు, ఇతర నిర్మాణాలను డిసెంబరులోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఈనెల 7వ తేదీన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా నెల్లూరు నగరంలోని విఆర్ మున్సిపల్ హైస్కూల్ ప్రారంభోత్సవం, మూలాపేట ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేయనున్నటు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు పి4లో భాగంగా మూలాపేట బాలికల హైస్కూల్‌ను దత్తత తీసుకొని అభివృద్ధి చేసేందుకు ముందుకొచ్చిన దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డికి మంత్రి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఆర్ ట్రస్టు నిర్వాహకులు దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి, దశరధరామిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి,అల్లూరు తాసిల్దార్ లక్ష్మీనారాయణ. సిఐ పాపారావు. ఎంఈఓ లు. రవీంద్ర. సునీత. తెలుగుదేశం పార్టీ నాయకులు రూప్ కుమార్ యాదవ్. బీద గిరిధర్. పలగాటి శ్రీనివాసులు రెడ్డి. రేబాల శంకర్ రెడ్డి. బండి శ్రీనివాసులు రెడ్డి. కలికి చంద్ర శేఖర్ రెడ్డి. నీలపరెడ్డి హరీష్ కుమార్ రెడ్డి. అంబటి రాజేంద్ర. రామి శెట్టి కృష్ణ చైతన్య,తోట శ్రీహరి. మునిరాజా, బిట్రగుంట వెంకట చైతన్య రెడ్డి, నజీర్ భాష.షేక్ ఇస్మాయిల్ ,కావాలి జగన్,గుమ్మడి పుట్టయ్య,చెంతాటి రాజశేఖర్ బాబు,జనసేన నాయకులు కార్తీక్ శర్మ,కత్తుల విజయ్ కుమార్,చేవూరు సుబ్రహ్మణ్యం,కత్తి విజయ్,ట్రస్టు మేనేజర్ అనిల్ కుమార్ రెడ్డి,సుబ్బరామిరెడ్డి,రామచంద్రయ్య.ట్రస్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యానాది కాలనీల్లో ప్రాథమిక పాఠశాలలను ఎత్తివేయడం అన్యాయం

**– బడుగు వర్గాలకు విద్యను దూరం చేయడం అన్యాయం – దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్ మల్లి**



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 30, ప్రభాతవార్త** : యానాది కాలనీల్లో ప్రాథమిక పాఠశాలలను ఎత్తివేయడం అన్యాయమని, బడుగు వర్గాలకు విద్యను దూరం చేయడం మంచి విధానం కాదని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్ మల్లి పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ముందు దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్ మల్లి మాట్లాడుతూ బోగోలు మండలంలోని కొండబిట్రగుం టయానాది కాలనీలో ఉన్న 46 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలను పక్క గ్రామంలో కలిపివేయడం దుర్మార్గమైన చర్య అని తెలిపారు. దళిత గిరిజన నివాస ప్రాంతంలో పాఠశాలలు ఉండాల్సి ఉండాగా చంద్రన్న ప్రభుత్వం జగనన్న చేసిన పనులను నిర్వహిస్తున్నారన్నారు. 117 జిఒ ప్రకారం 5,4,3 తరగతులను జిల్లా పరిషత్ పాఠశాలల్లో కలిపి వేసి ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలలను జిల్లా పరిషత్ పాఠశాలల్లో విలీనం చేయడం తగదన్నారు. దళిత గిరిజనులకు విద్యలేకుండా చేసిన జగనన్న చేసిన ప్రభుత్వం లాగా చంద్రన్న కూడా నిర్వహించడం అన్యాయం అన్నారు. ఎస్‌సి ఎస్‌టి కాలనీల్లో ఉన్న పాఠశాలలను 1 నుండి 5వ తరగతి వరకు దూరంగా జడ్‌పి పాఠశాలల్లో కలపకుండా యానాది కాలనీల్లో ఉన్న పాఠశాలలను అక్కడే ఉంచి ప్రాథమిక విద్యను అందించాలని యానాది పిల్లలను దూరంగా ఉండే పాఠశాలల్లో కలపకూడదని విద్యను బడుగు వర్గాలకు దూరం చేయకూడదని తెలిపారు. యానాది పిల్లలకు 80 తల్లికి వందనం రాలేదన్నారు. కలెక్టర్ దృష్టికి తీసుకొని రాగా కొండబిట్రగుంటలోని యానాదుల పాఠశాలలకు న్యాయం చేస్తానని అన్నారు. ఎస్ లక్ష్మయ్య, అశోక్, రాచగిరి మురళీ, పి హరి బాబు, 150 మంది మహిళలు పాల్గొని వినతిపత్రం అందజేసారు.

## ఆంధ్రప్రదేశ్ గ్రామ సర్వేయర్ల సంఘం జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్



**నెల్లూరు అగ్రికల్చర్, జూన్ 30, ప్రభాతవార్త** : కూటమి ప్రభుత్వం వచ్చాక ఉద్యోగులను కుదించాలనే లక్ష్యంతో సర్వేయర్లలో ఎస్‌యునో పొజిషన్ తెచ్చింది. దీన్ని మేము వ్యతిరేకిస్తున్నాము. క్లస్టర్ విధానంతో ప్రభుత్వం సర్వేయర్ల సంఖ్యను తగ్గించాలని చేస్తోంది. పెద్ద పెద్ద గ్రామాలకు ఇద్దరు లేదా ముగ్గురు సర్వేయర్‌లు ఉండగా, ప్రభుత్వం ఒక సర్వేయర్‌ను కేటాయిస్తోంది. ఈ విధానంతో మిగిలిన సర్వేయర్లను ప్రభుత్వం ఏం చేయబోతుందని చెప్పాలి. రెండు మూడు గ్రామాలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేయడంతో సర్వేయర్లకు అన్యాయం జరుగుతోంది.

## జాతీయ డెంగ్యూ మాసోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

**– డెంగ్యూ, టైఫాయిడ్ వ్యాధులను తరిమికొట్టండి – డీఎంఅండ్‌హెచ్‌ఓ సుజాత**



**నెల్లూరు జూన్ 30, ప్రభాతవార్త వైద్యం** డెంగ్యూ, టైఫాయిడ్ జ్వరాల పట్ల ప్రజల్లో అవగాహన పెంచి ఆ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి వి.సుజాత తెలిపారు. జులై1వ తేదీ నుండి డెంగ్యూను నివారించే కార్యక్రమంలో భాగంగా 31వ తేదీ వరక జరగనున్న జాతీయ డెంగ్యూ మాసోత్సవాల పోస్టర్‌ను జిల్లావైద్య ఆరోగ్యశాఖ అధికారిణి వి.సుజాత ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల జిల్లాలో వివిధ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న వైద్యులు డెంగ్యూ, టైఫాయిడ్ జ్వరాలు రాకుండా జాగ్రత్త వహించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఎస్‌కే ఖాదర్ వలి, జిల్లా మలేరియా అధికారిణి ఈ.హేస్సె నమ్మ, ఎన్ఆర్‌హెచ్ఎంపీఓ డాక్టర్ రమేషన, సహాయ మలేరియా అధికారి వి.నాగార్జునరావు, సబ్ యూనిట్ ఆఫీసర్లు మలేరియా కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కలకలం రేపుతున్న టీడీపీ నాయకుడు సుధాకర్ నిర్వాకం



**ఇందుకూరుపేట, జూన్ 30, ప్రభాతవార్త** : ఇందుకూరుపేట మండలం గంగపట్నంలోని శ్రీచా ముండేశ్వరి అమ్మవారి దేవస్థానంలో టీడీపీ నాయకుడు సుధాకర్ చేసిన నిర్వాకం కలకలం రేపుతోంది. గతంలో కోవూరు తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శిగా పని చేసిన బొద్దుకూరు సుధాకర్, ఆదివారం రోజున భక్తులు తిన్న అన్నం విస్తరులను ఏరుకుని దేవస్థానం ముందు ఈవో కార్యాలయ ఆవరణలో విసిరాడు. ఈ ఘటన చూసిన దేవస్థానం సిబ్బంది ఒక్క సారిగా ఉలిక్కి పడి, ఏమి చేయలేక మౌనంగా తిలకించారు. ఈ ఉద్దాంతంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. సుధాకర్ వెనుక ఎవరు ఉన్నారు..? అని ప్రశ్నిస్తున్నారు. అంతే కాదు, ఇదే దేవస్థానంలో గతంలో ఓ మహిళను కాలితో తన్నాడన్న ఆరోపణలు ప్రజల్లో చర్చనీయాంశమయ్యాయి. ఈ ఘటన అనంతరం దేవస్థాన సిబ్బంది పరిసరాలను శుభ్రపరిచారు.

## మూలపేట బాలిక ఉన్నత పాఠశాలల్లో ఆధునీకరణ పనులను శంకుస్థాపన చేయనున్న మంత్రి లోకేష్

**– మూలపేట బాలిక ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా పరిశీలించిన మంత్రి నారాయణ**
**– పాఠశాల ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం ఏర్పాటు**
**– తరగతి గదులు, పిల్లల సంఖ్యపై ఆరా తీసిన మంత్రి**
**– 54 ప్రభుత్వ పాఠశాలలో నాలుగేళ్లలో వీఆర్‌సీ తరహాలో సిద్ధం చేస్తాం**



**నెల్లూరు, జూన్ 30, ప్రభాతవార్త-వైద్యం** : వచ్చే నెల 7వ తేదీన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా మూలపేట ఆధునీకరణ పనులకు శంకుస్థాపన జరుగుతుందని రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా నెల్లూరు నగరంలోని మూలపేటలో ఉన్నటువంటి బాలిక ఉన్నత పాఠశాల ఆధునీకరణ పనులను రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆకస్మికంగా పరిశీలించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తరగతి గదులు, పిల్లల సంఖ్యపై అడిగి వివరాలు తీసుకున్నారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు ఇచ్చారు. అనంతరం మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు. ఘనమైన చరిత్ర కలిగినటువంటి వీఆర్సీ పాఠశాలను గత వైసీపీ ప్రభుత్వం మూసేసిందని మండిపడ్డారు. అయితే తమ ప్రభుత్వం వచ్చాక వీఆర్సీ ని పాఠశాలను పునఃప్రారంభించామని తెలిపారు. ఎన్‌సీసీ గ్రూప్, నారాయణ గ్రూప్ పర్యవేక్షణలో ఆధునీకరణ పనులు శరవేగంగా జరిగాయని ఆయన వెల్లడించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో స్కూల్‌ను అద్భుతంగా తీర్చిదిద్దిన తన పిల్లలకి, ఎన్‌సీసీ సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు. అయితే వీఆర్సీకి నారాయణ విద్యాసంస్థల నుంచి అకాడమిక్ సపోర్ట్ ఇస్తామన్నారు. 7వ తేదీన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ప్రారంభిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అదే విధంగా మూలపేట స్కూల్ పనులను కూడా లోకేష్ శంకుస్థాపన చేస్తారని వివరించారు. 1050 మంది పిల్లలకు విద్యాభ్యాసం చేసేలా ఆధునీకరిస్తామన్నారు. సిటీలో ఉన్నటువంటి సుమారు 54 ప్రభుత్వ పాఠశాలలో నాలుగేళ్లలో వీఆర్‌సీ తరహాలో సిద్ధం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. 14 పాఠశాలలను దాతల సహకారంతో ఏడాదిలోపు పూర్తి చేస్తామని తెలిపారు. అనంతరం డిఎస్ఆర్ కంపెనీ అధినేత సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి నారాయణ సార్ పిలుపు మేరకే వీఆర్సీ ఆధునీకరణ పనులు చూశామని, చూసిన వెంటనే వెంటనే ఒక స్కూల్‌ను కూడా దత్తత తీసుకోవాలని అనిపించిందన్నారు. మంత్రి నారాయణ పిలుపు మేరకు మూలపేట బాలిక ఉన్నత పాఠశాల ఆధునీకరణ పనులు చేపట్టామన్నారు. అడ్మిషన్స్ పెరిగితే అదనపు గదులు కూడా నిర్మిస్తామని ఆయన చెప్పారు. డీఎస్ఆర్ ట్రస్టు ద్వారా అల్లూరులో ఇంటర్నేషనల్ స్థాయిలో స్కూల్, హాస్పిటల్, స్కిల్ డవలప్‌మెంట్‌లు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమీషనర్ నందన్‌తో పాటు డిప్యూటీ మేయర్ కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ, 40 డివిజన్ ప్రెసిడెంట్ గండవరం నాని, వైస్ ప్రెసిడెంట్ గుమ్మడి రాజేశ్వరి, టీడీపీ ముఖ్య నేతలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదుల దినం నాడు ఖాళీ కుర్చీల స్వాగతం



**చేజర్ల జూన్ 30 ప్రభాతవార్త** : ఫిర్యాదుల దినం రోజున ఖాళీ కుర్చీలతో స్వాగతం పలికిన ఉదంతం చేజర్ల మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం చోటు చేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఫిర్యాదుల దినం రోజున కూడా అధికారులంతా విధులకు దుమ్మా కొట్టడంతో అర్జీదారులకు ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. చేజర్ల ఎంపిడిఒ సోమవారం పదవీ విరమణ చేయడంతో ఆమె నెల్లూరులో ఉన్నారు. సూపరింటెండెంట్ సైతం కార్యాలయంలో లేకపోవడంతో అర్జీలతో తరలి వచ్చిన బాధితులకు నిరాశ మిగిలింది. సీనియర్ అసిస్టెంట్ కూడా సెలవులో ఉండడంతో గంట రెండు గంటలపాటు వివిధ సమస్యలపై అర్జీలు ఇచ్చేందుకు చేజర్ల ఎంపిడిఒ కార్యాలయానికి తరలివచ్చిన ధరఖాస్తు దారులు పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌కు అర్జీలు సమర్పించి ఉసూరు మంటు వెళ్లారు.ఎంపిడిఒ ఇతర అధికారుల బాధ్యా రాహితంపై జిల్లా అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి. ఈవిషయంపై ఎంపిడిఒ వసుందరా దేవిని పత్రికా విలేఖర్లు వివరణ కోరగా నేను నెల్లూరులో ఉన్నానని కార్యాలయంలో సిబ్బందితో మాట్లాడతానని తెలిపారు. మధ్యహ్నం అనంతరం వస్తానని ఆమె బదులిచ్చారు.

## బిపిసిఎల్ పైప్ లైన్ ఊరి మధ్యలో వద్దు

**ముత్తుకూరు, జూన్ 30, ప్రభాతవార్త :** కృష్ణాపట్నం సముద్రం తీర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బిపిసిఎల్ పైప్ లైన్‌ను ఊరి మధ్యలో తీసుకెళ్లొద్దంటూ ఆర్కాట్ పాల్యెం, మధురా నగర్ హరిజనవాడ గ్రామస్తులతో కలిసి ఊరి మధ్యలో పైప్ లైన్ వేయడంతో భవిష్యత్తు ఇబ్బందులు తలెత్తుతాయని, ఆ పైప్ లైన్‌ను మరో చోట మార్చుకోవాలని బిపిసిఎల్ ప్రతినిధులకు సోమవారం తెలిపారు. ఈ పైప్ లైన్ ఊరి మధ్యలో వెళ్లడం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమైయ్యే సమస్యలు ఎక్కువ ఉంటాయని తెలిపారు. గతంలో కూడా పైప్ లైన్‌ను మార్చాలను బిపిసిఎల్ ప్రతినిధులకు తెలిపామన్నారు.

## గిరిజనులు తమ పిల్లలను శ్రద్ధగా చదివించాలి



**కావలిరూరల్, జూన్30 ప్రభాతవార్త :** గిరిజనులు తమ పిల్లలను శ్రద్ధగా చదివించాలని ఏటూరి రామిరెడ్డి కళ్యాణమండపం బాధ్యులు ఎటూరి రామిరెడ్డి తెలియచేశారు. డాక్టర్ రామ్‌సెంటర్ విశ్వోదయ ఆధ్వర్యంలో కావలి పెంకులఫ్యాక్టరి గిరిజన కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలోగల చిన్నారులకు సోమవారం విద్యాసామాగ్రి, పలకలు, పుస్తకాలు, పెన్సిళ్లు, రబ్బర్లు పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వచ్చిన ఏటూరి రామిరెడ్డి, రామ్‌సెంటర్ ఛైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త ఎం.మాలకొండారరెడ్డిలు మాట్లాడారు. గిరిజనకాలనీల్లోని పిల్లలందరూ బడిలో ఉండాలని పనిలో ఉండరాదని తెలిపారు. బాలకార్మిక వ్యవస్థను రూపుమాపుటకు తల్లి దండ్రులు తమ పిల్లలను శ్రద్ధగా చదివించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్ శారద, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ద్విచక్రవాహనము బహిరంగ వేలము

**కావలిరూరల్, జూన్30 ప్రభాతవార్త :** కావలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పరిధిలోని కేసులో సీజ్ చేయబడిన హోండా గ్రాజియ ద్విచక్రవాహనమును జులై 3వ తేదిన కావలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ నందు నెల్లూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ ఆధ్వర్యంలో బహిరంగ వేలము నిర్వహించబడునని కావలి ప్రొహిబిషన్స్ అండ్ ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ ఎస్.శ్రీనివాసులు సోమవారం తెలియచేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడారు. ఆసక్తి కలవారుబహిరంగ వేలములో పాల్గొనవచ్చునని తెలియచేశారు. బహిరంగవేలములో పాల్గొనువారు ప్రభుత్వంవారు వాహనంకు నిర్ణయించిన ధరలో 10శాతం ధరావత్తుగా చెల్లించవలెనని తెలియచేశారు. ఇతర వివరముల కొరకు కావలి ప్రొహిబిషన్స్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌నందు ఉంచిన నోటీసు బోర్డునందు సంప్రదించగలరని తెలియచేశారు.

## తొమ్మిదవ తేదీ జరిగే సమ్మెను జయప్రదం చేయాలి



**కావలిరూరల్, జూన్30 ప్రభాతవార్త :** కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు జులై 9వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు పట్టణ కార్యదర్శి వై.కృష్ణమోహన్ పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు 9వ తేదీన సమ్మెకు పిలుపునివ్వగా సోమవారం సిఐటియు అనుబంధ పారిశుధ్య కార్మికులు 9వ తేదీన సమ్మెలోకి వెళుతున్నట్లు మున్సిపల్ డిఈ సాయిరాంకు వినతిపత్రాన్ని ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వై.కృష్ణమోహన్ మాట్లాడారు. జులై 9వ తేదీన దేశవ్యాప్తంగా సమ్మె జరుగుతుందని, అందులో భాగంగా మున్సిపల్ కార్మికులు కూడా ఆ రోజు సమ్మెలో పాల్గొంటారని తెలిపారు. కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను కేంద్రప్రభుత్వం రద్దుచేయాలని, కనీస వేతనాలు అమలుచేయాలని తెలియచేశారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ, కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలని తెలిపారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తున్నందున కార్మికులు ఇబ్బందులకు గురౌతున్నారని తెలియచేశారు. మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనాలు అమలుచేయాలని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలకు స్వస్తి పలకాలని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు 9వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్మిక ప్రజావ్యతిరేక విధానాలపై ఐక్యంగా పోరాడి కార్మికుల హక్కులను కాపాడుకోవాలని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు తురక శీనయ్య, బిడుదల మహేష్, ఎం.బాలయ్య, కె.బాబు, ఒంగోలు రమేష్, అలేఖ్య, కార్మికులు పాల్గొన్నారు.

## డాక్టర్ డిఆర్ జయంతి సందర్భంగా స్విమ్మింగ్ పోటీలు

**కావలిరూరల్, జూన్30 ప్రభాతవార్త :** విశ్వోదయ విద్యాసంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ దొడ్ల రామచంద్రారెడ్డి (డిఆర్) జయంతి సందర్భంగా కావలి మండలస్థాయి స్విమ్మింగ్ పోటీలను జులై 4వ తేదీన జవహర్‌భారతి కళాశాలలోని డిఆర్ స్విమ్మింగ్‌పూల్ నందు ఉదయం 7 గంటలకు స్విమ్మింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు స్విమ్మింగ్‌పూల్ ఇన్‌చార్జి బ్రహ్మయ్య సోమవారం తెలియచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ స్విమ్మింగ్ పోటీలు బాలికలకు, బాలురకు వేరువేరుగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అండర్ 10 కేటగిరికి 25 మీటర్స్, అండర్ 14 కేటగిరికి 50 మీటర్స్, అండర్ 16 కేటగిరికి 100 మీటర్స్, అండర్ 19 కేటగిరికి 100 మీటర్స్, ఓపెన్ మెన్ అండ్ ఉమెన్ క్యాటగిరికి 100 మీటర్స్ నిర్వహించబడునని తెలియచేశారు. ఈ పోటీలన్నీ ఫ్రీస్టైల్ పద్దతిలో నిర్వహించబడునని తెలిపారు. ఎంట్రీలను స్విమ్మింగ్‌పూల్ ఇన్‌చార్జి బ్రహ్మయ్య సెల్ నెంబరు 7013771832 కి జులై 2వ తేది సాయంత్రం 5 గంటలలోపు నమోదు చేసుకోవాలని తెలిపారు.

## పంచాయితీ కార్యదర్శి అబ్దుల్ జహీర్ పై కలెక్టర్‌కు ఫిర్యాదు



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 30, ప్రభాతవార్త :** బోగోలు గ్రామ పంచాయితీ కార్యదర్శిగా అబ్దుల్ జహీర్ బాధ్యతలు చేపట్టిన నాటి నుండి బోగోలు గ్రామ పంచాయితీలో అనేక అవినీతి అక్రమాలకు పాల్పడి యున్నారు. దీనిలో భాగంగా బోగోలుకు చెందిన మిట్ట కిష్టయ్య కుమారుడు పిచ్చయ్య అను అతను సమాచార హక్కు చట్టం ద్వారా జమా ఖర్చులు అడగటం జరిగినది. దీనికి సమాధానంగా పంచాయితీ కార్యదర్శి ఇచ్చిన సమాధానంలో అనేక అవినీతి అక్రమాలకు పాల్పడినట్లుగా తెలియజేస్తూ దీనిలో భాగంగా త్రాగు నీటి వసతి కోసం సుమారు 7 లక్షల పారిశుద్ధ సామాన్లు కొనుగోలుకు రూ.4,00,000లు ప్రత్యేక పారిశుద్ధ పనుల కోసం రూ.4,47,300లు ట్రాక్టర్ డీజిల్ కొరకు రూ.2.27,752లు గ్రామ సభలు స్వర్ణ పంచాయితీ షామియానాల పేరుతో రూ.1,60,000లు ఖర్చు చేసినట్లుగా చెప్పియున్నారు. వీటిలో భారిగా అవినీతికి పాల్పడియున్నారు అని ఇవే కాకుండా ఈయన వచ్చిన నాటి నుండి గ్రామ పంచాయితీకి ఏ పని మీద వెళ్ళినా లంచం లేనిదే పనిచేయటము లేదు. అంతేకాకుండా పంచాయితీకి సంబంధించి దొంగ బిల్లు బుక్కు పెట్టి భారీగా అవినీతికి పాల్పడినాడు అని. ఈయన గ్రామ పంచాయితీలో ప్రవేట్ గా పనిచేస్తున్న దేవరపల్లి మనోహర్ ద్వారా లంచాలు దండుతున్నారూని దీనికి సాక్ష్యం గత జూలై నెల నుంచిన గ్రామ పంచాయితీ కార్యదర్శి దేవరపల్లి మనోహర్ బ్యాంక్ లావాదేవీలు పరిశీలించిన ఎడల వాస్తవాలు తెలుస్తాయి. అదేవిధంగా సర్పంచ్ వద్ద ప్రతి పనికి లంచం తీసుకుంటున్నారు. దీనికి సంబంధించి సర్పంచ్ భర్త అయినటువంటి పందిపాటి ఉదయ్ కుమార్ పంచాయితీ కార్యదర్శి బ్యాంక్ లావాదేవీలను పరిశీలించవలసినదిగా సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు.

## విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు పంపిణీ



**మర్రిపాడు, జూన్30, ప్రభాతవార్త:** మర్రిపాడు మండలంలోని చుంచులూరు ఉన్నత పాఠశాలలో గత సంవత్సరం జరిగిన 10వ తరగతి ఫలితాల్లో మొదటి 5స్థానాలు సాధిం చిన వారికి సోమవారం నగదు బహుమ తులను అందించారు. పాఠశాలలోని లహరి, సమీర, చరణ్, కీర్తి, శృతి లకు 8వేలు, 7వేలు, 6వేలు, 5వేలు, 4వేలు వంతున చుంచులూరు ఉన్నతపాఠశాల పూర్వ విద్యార్థి చింతంరెడ్డి సిద్దారెడ్డి–జయమ్మల కుమారుడు ప్రవాసభారతీయుడు సుదర్శన్‌రెడ్డి ధాతృత్వంతో పంపిణీ చేశారు. పాఠశాల మరొక పూర్వ విద్యార్థి బుగాట్టి షా కంపెనీ నందు ప్రోడక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న దువ్వూరు సురేష్‌కుమార్ విద్యార్థులకు రుచికరమైన విందు భోజనాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్ మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు దాతల సహకారాన్ని అందిపుచ్చుకొని బాగా కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో విశ్రాంత మండల విద్యాశాఖాధికారి జొన్నా సత్యనారాయణ; మాజీ సర్పంచ్ దువ్వూరు జయదేవ్, గ్రామానికి చెందిన ఇరుకుమాటి మురళీధర్‌రావ్; ఓబులమ్మ, తంగేడుపల్లి సుబ్బయ్య, మల్లీశ్వరి, అశ్విని, ఉపాధ్యాయులు రమణయ్య, పెంచలరావ్, మల్లిఖార్జునస్వామి, బాలాజీ, తిరుపాలు, రహీమ, రాజేంద్రకుమార్, సునీత, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## లారీపై నుంచి పడి క్లీనర్ మృతి



**కోవూరు, జూన్30 ప్రభాతవార్త :** కోవూరులోని జాతీయ రహదారి వినాయక స్వామి గుడి సమీపంలో సోమవారం తెల్లవారుజామున విజయవాడ నుంచి నెల్లూరు వైపు ప్రయాణిస్తున్న లారీ నుంచి క్లీనర్ నారాయణ అదుపుతప్పి రోడ్డుపై పడి తీవ్రగాయాలపాలయ్యాడు. 108 వాహనం వచ్చే సరికి నారాయణ మృతిచెందాడు. ఈ మేరకు సంఘటనా స్థలాన్ని కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## మత్స్య కార సభ్యుల సమస్యలు పరిష్కరించండి

– యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెసి పెంచలయ్య, డిమాండ్



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 30, ప్రభాతవార్త :** కనిగిరి – దువ్వూరు (కెడి రిజర్వాయర్) గాంధీ జన సంఘం మత్స్య కార సహకార సంఘం మత్స్యకార సభ్యుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యానాదుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరుగుచున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నెల్లూరు జిల్లా కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం సమర్పించారు. సొసైటీకి సంబంధించి లీజు మొత్తం తగ్గించాలని, కట్టాల్సిన లీజు చెల్లించేందుకు గడువు ఇవ్వాలని కలెక్టర్‌ని కోరగా, తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెసి పెంచలయ్య, మహిళా అధ్యక్షురాలు చెంబేటి ఉష, జిల్లా కమిటీ సభ్యులు యల్లంపల్లి శీనయ్య, డైరెక్టర్లు చలంచర్ల నరసయ్య, తిరుమలశెట్టి వెంకటరమణయ్య, మారెళ్ల బంగారయ్య పాల్గొన్నారు.

## గురుపౌర్ణమి కోసం సాయి సేవకుల బిక్షాటన



**బిట్రగుంట జూన్ 30 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన బోగోలు రాజావీధిలోని స్వర్గీయ అమర బచ్చు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో జులై 10 వ తేది నిర్వహించనున్న శ్రీ షిరిడీ సాయిబాబా గురుపౌర్ణమి ఉతవాల కోసం సాయి సేవకులు గత రెండు రోజులుగా బిక్షాటన చేసి వస్తు, ఆర్థిక విరాళాలు సేకరించారు. ఈ ఉత్సవ నిర్వహణలో భక్తుల భాగస్వామ్యం ఉండాలనే ఉద్దేశ్యం తో ఇంటింటికి వెళ్లి ప్రధాన వీధిలలో వీటిని సేకరించారు. గురుపౌర్ణమి రోజున పూజా కార్యక్రమాలతో పాటు నిర్వహించే అన్నదాన కార్యక్రమం కు బిక్షాటన చేసిన వస్తు, ఆర్థిక విరాళాలు ఉపయోగిస్తారని నిర్వాహకులు తెలిపారు.

## విమానాశ్రయ భూములకు న్యాయమైన పరిహారం చెల్లించాలి



**కావలిరూరల్, జూన్30 ప్రభాతవార్త :** దగదర్తి మండలం దామవరం వద్ద విమానాశ్రయం ఏర్పాటుకు తామంతా అనుకూలమని కాని తమ అనుభవంలో ఉన్న భూములకు న్యాయమైన పరిహారం చెల్లించాలని దామవరానికి చెందిన పలువురు దళితరైతులు కోరారు. కావలి ఆర్డీఓ కార్యాలయం వద్ద సోమవారం దళితరైతులు ధర్నాను నిర్వహించారు. అనంతరం గ్రామసర్పంచ్ నిమ్మకాయల ప్రసాద్, చిన్నకారురైతులు ఆర్డీఓ సన్నివంశీకృష్ణను కలిసి వినతిపత్రం అందచేసి మాట్లాడారు. తాము సాగుచేసుకుంటున్న భూములకు తమకే పరిహారం చెల్లించాలని కోరారు. తమకు పట్టాలు లేకపోయినా గత 30 సంవత్సరాల నుంచి తామే సాగుచేసుకుంటున్నామని తెలిపారు. మా భూములు విమానాశ్రయానికి పోయినామేమంతా విమానాశ్రయానికి అనుకూలమేనని తెలియచేశారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, కలెక్టర్, ఆర్డీఓ దృష్టికి తీసుకువెళ్లి తమకు న్యాయం చేయాలని కోరారు.

## టి.సిలు ఇవ్వకుండా వేధిస్తున్న శ్రీ చైతన్య స్కూల్ యాజమాన్యం

**కావలిరూరల్, జూన్30 ప్రభాతవార్త :** తాము కట్టవలసిన ఫీజులు చెల్లిస్తామని తమ ఇద్దరు బిడ్డల టి.సిలు ఇవ్వమని కావలి శ్రీ చైతన్య స్కూల్ యాజమాన్యాన్ని అడిగినాకూడా ఇంకా ఫీజు చెల్లించాలని, చెల్లిస్తేనే టి.సిలు ఇస్తామని లేకుంటే టి.సిలు ఇవ్వమని తమను వేధిస్తున్నారని విద్యార్థుల తల్లి వి.శాంతి సోమవారం గ్రీవెన్స్‌డేలో కావలి ఆర్డీఓ సన్నివంశీకృష్ణకు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా శాంతి మాట్లాడారు. టి.సిలు ఇవ్వమనివెళితే శ్రీ చైతన్య స్కూల్ యాజమాన్యం వాచ్‌మేన్‌చేత బయటకు నెట్టేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయమై మూడు రోజుల కిందట డిప్యూటి విద్యాశాఖ అధికారికి ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదని తెలిపారు. స్కూల్ యాజమాన్యం చెప్పిన ఫీజులన్ని కట్టినప్పటికి ఇంకా కట్టాలని అంటున్నారని తెలియచేశారు. అందులో సగం చెల్లిస్తామని చెప్పినప్పటికి టి.సిలు ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీ చైతన్య స్కూల్‌లో ఫీజులు భరించలేక మరొక స్కూల్‌లో చేర్చడానికి టి.సిలు లేక ఇబ్బందులు పడుతున్నామని తెలియచేశారు. దీనివల్ల ఇద్దరు బిడ్డలకు తల్లికి వందనం పథకం కింద వచ్చే 26వేల రూపాయలు కోల్పోతున్నామని తెలిపారు. ఆర్డీఓ తమ సమస్యలను పరిష్కరించి తమ బిడ్డలకు టి.సిలు వచ్చే విధంగా చేయాలని కోరారు.

## క్వాలిటీ లేని నాణ్యతపై విచారణ జరిపించాలి

– విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు శేషం సుదర్శన్



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 30, ప్రభాతవార్త :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల విద్యాలయం ముత్తుకూరు హాస్టల్ విద్యార్థుల ఆహార సరఫరా చేయు ప్రావిజన్స్‌లో క్వాలిటీ లేని నాణ్యతపై విచారణ జరిపించాలి అంటు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరుగుతున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు శేషం సుదర్శన్ దళిత సంఘ నాయకుడు కొప్పల రఘు జాయింట్ కలెక్టర్ కార్తీక్‌కు వినతి పత్రం అందజేశారు. నెల్లూరు జిల్లా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల విద్యాలయం ముత్తుకూరు నందు ప్రస్తుత అకాడమీ ఇయర్ సంబంధించిన 2025 – 2026 గాను సుమారు 450 పైగా విద్యార్థులు విద్యాభ్యాసం చేయుచున్నారు. అని ముత్తుకూరు నందు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల విద్యాలయంను సందర్శించగా 2025 విద్యా సంవత్సరానికి గాను హాస్టల్ నందు విద్యార్థుల ఆహార సరఫరా చేయు ప్రావిజన్స్‌లో కౌలిటీ లేని నాణ్యతను ఉపయోగిస్తున్న అక్కడి ప్రిన్సిపాల్ నాణ్యతా పరిణామాలను పరిశీలించకుండా ప్రావిజన్స్ సరఫరా చేసే ఏజెన్సీలతో కలిసి విద్యార్థుల ప్రాణాలతో చాలగటం ఆడుతూ అవినీతికి పడుతున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హాస్టల్ విద్యార్థుల ఆహార సరఫరా చేయు ప్రావిజన్స్ ఏజెన్సీల వారిని, హాస్టల్ సిబ్బంది వారిని, ప్రిన్సిపాల్ పై సమగ్ర విచారణ జరిపించుటకు నిజాయితీ గల అధికారులను నియమించి కొలిటీ లేని ప్రావిజన్స్ పట్ల తగు నివేదికల ఆధారముగా చర్యలు చేపట్టి బాలికల విద్యార్థుల భావితరాల భవిష్యత్తును తీర్చిదిద్దే విధంగా ఆదేశాలు జారీ చేయవలసిందిగా ,జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు శేషం సుదర్శన్ ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘ నాయకులు పాల్గొన్నారు.

## పది టాపర్స్‌కు నగుదు బహుమతి అందజేత



**జలదంకి, జూన్30, ప్రభాతవార్త:** పదవతరగతిలో ఉత్తమ ప్రతిభ కనపరచి టాపర్స్‌గ నిలిచిన విద్యార్థులకు ఓల్డ్ స్టూడెంట్స్ అసోషియేషన్‌వారు నగదు బహుమతి అందజేశారు .సోమవారం జలదంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఓకార్యక్రమంలో ఒఎస్‌ఎ గౌరవాధ్యక్షుడు, మరియు మద్దుల మాల్యాద్రి లక్ష్మీ నర సింహం, లక్ష్మీకాంతమ్మ మెమోరియల్ ట్రస్ట్ అదినేత మద్దుల నరసింహం, ఓల్డ్ స్టూడెంట్స్ అధ్యక్షుడు కోర్సిపాటి హరినారపరెడ్డి తదితరులు పాల్గొన్నారు. పదిలో మెరిసిన ద్రోణాదుల వైష్ణవి, మారుబోయిన లక్ష్మీప్రత్యుష, సింధులకు ప్రోత్సాక నగదును అందజేశారు. ఈసందర్భంగ కావలి మోడరన్ టెక్స్‌టైల్స్ అదినేత, మద్దుల నరసింహం మాట్లాడుతు విద్యార్దులు తమ జీవితాలను కాంతిమయం చేసుకొనేందుకు చదువే మార్గమన్నారు. తల్లిదండ్రుల కన్న కలలను సాకారం చేసేందుకు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. తాము ఈబడిలో విద్యనభ్యసించి పైకెదిగామని ఆక్రమంలో తల్లిలాంటి పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న స్టూడెంట్స్‌ను ప్రోత్సహించేందుకు ప్రతి ఏడాది టెన్స్ విద్యార్థులకు బహు మతులు అందజేస్తున్నామన్నారు. అంతేకాకుండ పాఠశాల అభివృద్దిలో ఓల్డ్ స్టూడెంట్స్ అసోషియేషన్ తమ పాత్ర పోషిస్తుందని వివరించారు. ఈఅవకాశాలను ప్రతి పిల్లవాడు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఓల్డ్ స్టూడెండ్స్ అసోషియేషన్ ట్రెజరర్ ఎస్వి శేషారెడ్డి, వైసిపి మండల కన్వీనర్ ఇస్కామ దనమోహన్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాద్యాయిని ఉపాద్యాయులు తదితరలు పాల్గొన్నారు.

## జగన్ మోహన్ రెడ్డి పర్యటనకు పోలీసులు తీవ్రమైన ఆంక్షలు



**నెల్లూరు రూరల్, జూన్ 30, ప్రభాతవార్త :** వైయస్ జగన్మోహన్ రెడ్డి నెల్లూరు పర్యటనలో భాగంగా హెలి ప్యాడ్ కోసం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మొదట ప్రతిపాదించిన స్థలాలను అధికారులు అంగీకరించడం లేదు . వీటికి ప్రత్యామ్నయంగా నేదు నెల్లూరు చెముడుగుంట సెంట్రల్ జైల్ సమీపంలో వైఎస్ఆర్సిపి రూరల్ ఇన్‌చార్జ్ ఆనం విజయ్ కుమార్ రెడ్డి, వైసిపి నాయకులతో కలిసి వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పోలీసులు సూచిస్తున్న హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు చూపిన హెలిప్యాడ్ స్థలం అనువుగా లేకపోవడంతో పార్టీ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. పోలీసులు చూపిన స్థలం హెలికాప్టర్ దిగడానికి అనుకూలంగా లేకపోవడం చుట్టూ ముళ్ళ పొదలు రెండు వైపుల హై టెన్షన్ వైర్లు ఉండడం, అప్రోచ్ రోడ్డు లేకపోవడం, లాంటి ప్రమాదకరమైన పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయని పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. కార్యకర్తలు కూడా జగన్మోహన్ రెడ్డికి సంఘీభావంగా వచ్చే వీలు లేకుండా ఉందన్నారు. జగన్మోహన్ రెడ్డికి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేకే తెలుగుదేశం పార్టీ జగన్మోహన్ రెడ్డి పర్యటనను ఆంక్షలతో అడ్డుకోవాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## చెరువుల ఆక్రమణలను అరికట్టండి

– ఎస్ డి పి ఐ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 30, ప్రభాతవార్త :** చెరువుల ఆక్రమణ వెంటనే అరికట్టాలని సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా సోమవారం ప్రజా విజ్ఞప్తుల దినం కలెక్టర్ ఆనంద్ వినతి పత్రం సమర్పించారు ఈ సందర్భంగా సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షులు షేక్ ఇమామ్ భాష మాట్లాడుతూ నెల్లూరు స్వర్ణాల చెరువు మత్స్యకారులకు జీవనాధారం మాత్రమే కాకుండా సామాజిక ఆధ్యాత్మిక ఉత్సవాలకు ముఖ్య కేంద్రంగా నిలుస్తుంది. రొట్టెల పండగ రాస్తాయిలో ప్రాముఖ్యత పొందినది ఈ చెరువులో నీటిమట్టం తగ్గుదల నీటి కలుషిత అవడం మత్స్యకారుల ఆదాయ నష్టాలు స్థిర హద్దులు లేని కారణం వలన ఆక్రమణలు జరుగుతున్నాయి. స్వర్ణాలు చెరువు కొత్తూరు అంబాపురం వైపు ఆక్రమణలకు గురవుతున్నది. ఈ ఆక్రమణల వల్ల భవిష్యత్తులో వర్షాలు వరదలు ఎక్కువైతే నెల్లూరుకు ముప్పు ఉంటుందని అందువలన ఈ నష్టాలను నివారించేందుకు ఆక్రమణలను నివారించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ డి పి ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 30, ప్రభాతవార్త :** ఉపాధి హామీ కూలీల బకాయిలు వెంటనే విడుదల చేయాలి అని 200 పని దినాలు కల్పించాలి 600 రూపాయలు కనీస కూలి కొరకు నెల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. 2005 సంవత్సరం యూపీఏ గవర్నమెంట్లో వామపక్షాల పోరాట ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయం కార్మికుల కొరకు వచ్చిన చట్టం ఎం.ఎన్.ఆర్.జి.ఏ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం. ఈ చట్టం రావడంతో గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ కార్మికులకు భరోసా ఏర్పడి వలసలుతగ్గి స్థానిక వ్యవసాయ పనులలో కూలీల కూలి రేట్లు పెరిగి మూడుపూట్ల తిండి దొరికి పేదల జీవితాల్లో వెసులుబాటు కలిగింది. ఇలాంటి చట్టాన్ని కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి కూటమి ఈ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి కుట్రపన్ని కేంద్ర బడ్జెట్లో క్రమంగా నిధులు తగ్గిస్తూ ఈ చట్టాన్ని ఎత్తి వేయాలని ప్రయత్నం చేస్తుంది. అందులో భాగమే ఈ సంవత్సరం కేంద్ర బడ్జెట్లో కేవలం 83 వేల కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించింది. వాస్తవంగా ఈ చట్టం ద్వారా దేశం మొత్తం మీద పేదలందరికీ 150 రోజులు పని కల్పించాలంటే 2 లక్షల కోట్ల రూపాయల అవసరం ఉన్నది. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం కూడా బిజెపికి వంత పాడుతూ ఉపాధి హామీ చట్టానికి ప్రాధాన్యత ఇవ్వడం లేదు. ఉప ముఖ్యమంత్రి గారు ఉపాధిహామీ చట్టం ద్వారా సంవత్సరం సరిపడ పనులను రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి గ్రామ సభలు పెట్టి చేయవలసిన పనులను ఆమోదించి కూలీలకు పనులు కలిస్తామని చెప్పి 60 శాతం పనులను యంత్రాలతో చేయించడానికి తీర్మానాలు చేశారు. ప్రస్తుతం కూలీలతో కేవలం 40 శాతం పనుల కూడా గ్రామాలలో చేయించడం లేదు. గ్రామాలలో అధికార పార్టీ నాయకులు వాళ్ల చెప్పిన పనులు చేయాలని గ్రామస్థాయిలో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లను, సిబ్బందిపై ఒత్తిడి తెచ్చి నిధులు దుర్వినియోగం చేసి స్వాహా చేస్తున్నారు. జరిగే ఉపాధి హామీ పనులు కూడా ఎక్కడా చట్ట ప్రకారం జరగడం లేదు. పని ప్రదేశాలోఎక్కడ నిబంధనలు పాటించడం లేదు. ఏదైనా ప్రమాదం జరిగినా కనీసం మెడికల్ కిట్టు కూడా ఉండడం లేదు. గతంలో ఎండాకాలంలో చేసిన పనికి కూలితోపాటు సమ్మర్ అలవెన్స్ 30 లేకపోతే 40 కలిపి కూలి ఇచ్చేవారు. త్రాగడానికి నీళ్లు, నీడ, మజ్జిగ లాంటివి ఏర్పాటు చేసేవారు. చేసిన పనికి పేస్లిప్ ఇచ్చేవారు. అవి ఇప్పుడు ఎక్కడ అమలు జరగడం లేదు. అమలు చేయకపోగా ఇప్పుడు మస్టర్లు ముఖచిత్రం ద్వారా తీసుకోవాలని జిపిఎస్ విధానం తెచ్చారు. కూలీలకు రెండుసార్లు ఫోటోలు తీసి మస్టర్లు వేయాలని చెప్పడంతో కూలీలు చాలా ఇబ్బందులు (కాల్వపనులు లాంటివి చేసినపుడు) పడుతున్నారు. అలాగే చేసిన పనికి నెలల తరబడి కూలీల బకాయిలు విడుదల కావడం లేదు. ఇప్పటికి జిల్లాలో 12 వారాలు 10 వారాలు కూలీలు బకాయిలు ఉన్నాయి. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

## నేడు ట్రస్టు ఆధ్వర్యంలో డాక్టర్స్ డే వేడుకలు



**కోవూరు, జూన్30 ప్రభాతవార్త :** కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రం, ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న వైద్యులకు మంగళవారం డాక్టర్ డేను పురస్కరించుకుని పెద్ది ప్రభావతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సన్మానాలు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ మారుతీ నాగార్జున తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా ఇటువంటి సామాజిక సేవా కార్యక్రమాలను ట్రస్టు ద్వారా నిర్వహిస్తూనే ఉన్నామన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో వైద్యులు చేసే సేవలు వెలకట్టలేనివని, కరోనా సమయంలో వారు చూపిన తెగువ ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమన్నారు. అటువంటి వారికి సన్మానం చేయడం తమ ట్రస్టు అదృష్టంగా భావిస్తున్నామన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీ

– యాచకుడు మృతి



**కోవూరు, జూన్30 ప్రభాతవార్త :** కోవూరులోని జాతీయ రహదారి శివాలయం సమీపంలో సోమవారం తెల్లవారుజామున రోడ్డు దాటుతున్న ఓ గుర్తు తెలియని యాచకుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ సంఘటనలో తీవ్రగాయాల పాలైన ఆ యాచకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు సంఘటనా స్థలాన్ని ఎస్సై రంగనాథ్ గౌడ్ పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతునికి (35) సంవత్సరాలు ఉంటుందని ఆచూకీ తెలిసిన వారు కోవూరు పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలన్నారు.

## రైల్వే గేటు రోడ్డుకు మరమ్మతులు చేయండి

– ప్రమాదాల బారిన పడుతున్నారు



**కోవూరు, జూన్30 ప్రభాతవార్త :** కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ పంచా యతీ పరిధిలోని ఎన్‌టీఎస్ రైల్వే గేట్ మధ్య లో రోడ్డు గుంతలుగుంతలుగా ఉన్నం దున ద్విచక్ర వాహనదారులు ఈ గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారని పడుగు పాడు గ్రామ టీడీపీ ఇన్‌చార్జి జెట్టి మదన్ మోహన్‌రెడ్డి సోమవారం కోవూరు రైల్వే స్టేషన్ మేనేజర్‌కు, నెల్లూరు ఏడీఈఎన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వారంలో ఈ రహదారి ప్రాంతంలో ద్విచక్ర వాహనం టైరు ఇరుక్కుని పడుగుపాడుకు చెందిన షేక్ హుసేన్‌బాషా ట్రైన్ ప్రమాదంలో మృతిచెందారన్నారు. దీనికి తోడు ఈ ప్రాంతమంతా పూర్తిగా గతుకులమయంగా, గుంతలగుంతలుగా ఉండడంతో వాహనచోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఈ ప్రాంతంలో రోడ్డు వేసి ప్రమాదాలు నివారించాలని ఈ సందర్భంగా వారు రైల్వే అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు వారు సానుకూలంగా స్పందించినట్లు మదన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు రమేష్ యాదవ్, డి. శ్రీనివాసులు నాయుడు, విన్నకోట రాఖీ, శ్రీనివాసులు, పెద్ద సంఖ్యలో నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

## చెంచమ్మతల్లి అరుగును అన్యమతస్తులు కూల్చివేశారు



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 30, ప్రభాతవార్త :** హిందువుల మనోభావాలు కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని వీహెచ్పీ నేత ఏవిఆర్ మోహన్ రావు బీజేపీ నేత మిడతల రమేష్ వి సునీల్ రెడ్డిలు నెల్లూరు డిఆర్ఓ ఉదయ భాస్కర్‌కు విజ్ఞప్తి చేశారు. దేవత మూర్తిగా పూజలు అందుకుంటున్న చెంచమ్మ వేపచెట్టును నరికి వేయపోతే స్థానిక మహిళలు అడ్డుకున్నారు. హిందూ మనోభావాలను దెబ్బతీసిన అన్యమతస్తులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని వీహెచ్పీ బీజేపీ అరుంధతి నేతలు కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఓ ఉదయభాస్కర్‌కు ఫిర్యాదు చేశారు.

# చరిత్రలో నిలిచిపోయేలా రొట్టెల పండుగ ఏర్పాట్లు

## - మంత్రి పొంగూరు నారాయణ వెల్లడి



**నెల్లూరు, జూన్ 30, ప్రభాతవార్త – వైద్యం** కుల మతాలకు అతీతంగా మత సామరస్యాలకు ప్రతీకగా.. వచ్చే నెల 6 నుంచి నెల్లూరులో జరిగే రొట్టెల పండుగకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో కలిసి దర్గాలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. స్వర్ణాల చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించే పనులను జెండా ఊపి ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డితో అభివృద్ధి పనుల గురించి చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చరిత్రలో నిలిచిపోయేలా బారా షాహిద్ దర్గా లోని రొట్టెల పండుగకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 2014-209 లో తాను మంత్రిగా ఉన్న సమయంలో దర్గాలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశామని గుర్తు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రోడ్లు టాయిలెట్స్ ఏర్పాటు చేశామన్నారు. ప్రత్యేకించి మహిళా భక్తుల కోసం రూమ్‌లు నిర్మించామని వివరించారు. అప్పటి నుంచి రొట్టెల పండుగకు భారీ భక్తుల తాకిడి ఎక్కువ అయిందన్నారు. దర్గాలో హాల్ నిర్మాణానికి సీఎం చంద్రబాబు ఐదు కోట్లు నిధులు విడుదల చేశారని, మెరుగైన డిజైన్తో హాల్ నిర్మించేందుకు 9 కోట్లు ఖర్చు అవుతుందని వివరించారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు అధికారులు చర్చించి హాల్ డిజైన్ ఫైనల్ చేస్తున్నారని, పండుగ అయిన వెంటనే పనులను ప్రారంభిస్తామన్నారు. భక్తులు కోరిన కోరికలు నెరవేరుతున్నాయి. కాబట్టి భారీగా దేశ విదేశాల నుంచి భక్తులు వస్తున్నారని, వారికి అవసరమైన సౌకర్యాలు అన్నీ కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 75 శాతం పనులు పూర్తయ్యాయని మరో రెండు రోజుల్లో మిగిలిన పనులు అన్నింటిని పూర్తి చేశామన్నారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారని మీడియాకు తెలిపారు. అనంతరం కోటంరెడ్డి మాట్లాడుతూ జులై 1 సాయంత్రం 6గంటలకి బారా షాహిద్ దర్గా కమిటీ నూతన అధ్యక్షుని ప్రమాణ స్వీకారం ఉంటుందని తెలిపారు. మంత్రి పొంగూరు నారాయణ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజీజ్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కమీషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, నగర అధ్యక్షుడు మామిడాల మధు, మైనార్టీ నాయకులు, టీడీపీ ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పనిచేయని వాటర్ ప్లాంట్ ..అవస్థల్లో బాలికలు



**కోవూరు, జూన్30 ప్రభాతవార్త :** గత ప్రభుత్వం నాడు-నేడు పథకం కింద 5 లక్షలు వ్యయం చేసి స్థానిక పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేశారు. కేవలం కొద్దికాలం మాత్రమే పనిచేసిన ఈ వాటర్ ప్లాంట్ అనంతరం మరమ్మతులకు గురి కావడంతో సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిధులు వెచ్చించి మరమ్మతులు చేస్తున్నా మరలా అది మరమ్మతులు పాలవుతుంది. దీంతో ఇప్పటికే 700 మందికి పైగా ఉన్న ఈ పాఠశాలలోని విద్యార్థినులు మంచినీటి కోసం తీవ్ర అవస్థలు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ వాటర్ ప్లాంట్ ఆశించిన మేర నాణ్యతా ప్రమాణాలు లేకపోవడంతో ఈ దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి మరమ్మతులుకు గురైన ఈ వాటర్ ప్లాంట్‌ను వాడుకలోకి తీసుకురాకపోతే తమ బిడ్డలు మంచినీటి కోసం అవస్థలు పడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

# జాబ్ మేళాకు విశేష స్పందన




వింజమూరు, జూన్ 30, ప్రభాతవార్త శ్రీనేతాజీ డిగ్రీ కళాశాలలో సోమవారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ నేతృత్వంలో నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. స్థానిక నేతాజీ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు పెద్ద ఎత్తున స్పందన లభించింది. కళాశాలలోని మూడు ఫ్లోర్లో ఒక్కొక్క ఫ్లోర్‌కు కూటమినేతను ఇన్‌ఛార్జిగా నియమించి ఒక్కొక్క హెచ్‌ఆర్‌కు ఒక వాలంటరీ అందుబాటులో ఉంచారు. కళాశాలలో సుమారు 20 తర్వాత గదిలో 20 కంపెనీలతో జాబ్ మేళాకు విచ్చేసిన వారిని ఇంటర్వ్యూ నిర్వహించారు. వెంటనే నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నియోజకవర్గంలోని నిరుద్యోగులకు ఈ ఏడాది 1000 ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కృషి చేస్తున్నాడన్నారు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సంకల్పంతో పని చేస్తుందన్నారు. జిల్లాలోని అత్యంత వెనుకబడిన ఉదయగిరి నియోజకవర్గంలో నిరుద్యోగ యువత యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించి వారి జీవితంలో వెలుగులు నింపాలన్నదే లక్ష్యమన్నారు. అందులో భాగంగా ప్రస్తుతం నిర్వహిస్తున్న జాబ్ మేళాకు విచ్చేసిన నిరుద్యోగులు ఉద్యోగులుగా తిరిగి ఇంటికి వెళ్లడం ఆనందదాయకమన్నారు. రానున్న నాలుగేళ్లలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తన శక్తి వంచనకు మించి ఉపాధి అవకాశాలు అభివృద్ధి చేయాలన్నది ఎమ్మెల్యే లక్ష్యం అన్నారు. జిల్లా స్కిల్ డవలప్‌మెంట్ ఆఫీసర్ ఎస్‌కే అబ్దుల్ ఖయ్యూం రీజనల్ ప్లేస్మెంట్ అధికారిణి కిరణ్మయి జాబ్ మేళాను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పొలిటికల్ వింగ్ మేనేజర్, మాలేపాటి చైతన్య మాట్లాడుతూ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు కళాశాల కరస్పాండెంట్ గురిజాల రామ్ గోపాల్(గోపి), కేవీ రత్నం జాబ్ మేళాకు విచ్చేస్తున్న వారికి మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేయడంతో పాటు వారికి కళాశాలలో అన్ని సౌకర్యాలు కల్పించి కార్యక్రమంను విజయవంతం చేయడంలో ఉదయగిరి నియోజకవర్గం కూటమి నేతలు కార్యకర్తలు కృషి ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ గొంగటి రఘునాధరెడ్డి, గూడ నర్సా రెడ్డి, సర్పంచ్ నల్లగొండ సృజన, సీనియర్ నాయకులు వనిపెంట కోడూరు నాగిరెడ్డి, ఎగినేని శ్రీనివాసులు నాయుడు, మంచాల శ్రీనివాసులు నాయుడు, చల్లా శ్రీనివాస్ యాదవ్, పాములపాటి మాల్యాద్రి, కేఎస్ నాయుడు, దుద్దుగుంట శ్రీనివాసరెడ్డి, ఇతర మండలాల కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

# రెడ్‌క్రాస్ సాంస్కృతిక పోటీలు ప్రారంభం




కావలిరూరల్, జూన్30 ప్రభాతవార్త ప్రపంచ రక్తదాతల దినోత్సవాల సందర్భంగా కావలి రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు అంశాలలో సాంస్కృతికపోటీలు సోమవారం ప్రారంభించారు. రెడ్‌క్రాస్ భవనంలో ఈ పోటీలను కావలి రెడ్‌క్రాస్ పోషకసభ్యులు, కళాబంధు మన్నెమాల గోవిందురెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త డి.వి.ఫణికుమార్, ప్రముఖ గాయకులు సూరిశెట్టి రామచంద్రరావు, టంగుటూరి జయశ్రీలు జ్యోతిప్రజ్వలనచేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కావలి రెడ్‌క్రాస్ ఛైర్మన్ డి.రవిప్రకాష్ మాట్లాడారు. విద్యార్థులలో రక్తదానంపై అవగాహన పెంచేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలియచేశారు. సోమవారం నుండి శనివారం వరకు పోటీలను నిర్వహించి ఆదివారం విజేతలకు బహుమతులు ప్రధానం చేస్తామని తెలిపారు. సోమవారం లలిత గీతాలు నిర్వహించగా పలు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల నుండి విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ వైస్‌ఛైర్మన్ కె.హరినారపరెడ్డి, కోశాధికారి ఆరికట్ల మధుసూధన్‌రావు, పాలకమండలి సభ్యులు ఒరుగంటి వెంకటేశ్వర్లు, బెజవాడ ప్రసన్నకుమార్, తలసేమియా ఆసుపత్రి సభ్యులు కల్లయ్య, జనవిజ్ఞానవేదిక కావలి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు తోట వెంకటేశ్వర్లు, గాదిరెడ్డి హరనాథ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరికీ ఆదర్శం.. లక్ష్మీప్రసన్న



**కోవూరు, జూన్30 ప్రభాతవార్త :** అంగన్‌వాడీ శాఖలో వర్కర్ నుంచి గ్రేడ్-1 సూపర్‌వైజర్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన లక్ష్మీప్రసన్న ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రా యులని సీడీపీవో జ్యోతిఅన్నారు. కోవూరులోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యా ల యంలో సోమవారం కోవూరు మం డలం లో గ్రేడ్-1 సూపర్‌వైజర్గఆ పనిచేస్తూ సోమవారం పదవీవిరమణ చేసిన లక్ష్మీప్ర సన్నకు ఘనంగా సత్కరించి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ తనకిచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూ తన పరిధిలో ఉన్న కేంద్రాలను ఆదర్శంగా తీర్చిదిద్దేల ప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగంలో చేరే ప్రతి ఒక్కరికీ పదవీ విరమణ తప్పదని, అయితే ఆ పదవిలో ఉండగా చేసిన సేవలు గుర్తుండిపోతాయన్నారు. ప్రస్తుతం ఐసీడీఎస్‌లో ఉద్యోగంలో చేరే వారు లక్ష్మీప్రసన్నను ఆదర్శంగా తీసుకోవాలని కొనియాడారు. ఇంకా ఈ కార్యక్రమంలో నెల్లూరు రూరల్ సీడీపీవె అరుణ, సూపర్‌వైజర్లు పలు సూచనలు చేశారు. అనంతరం ప్రాజెక్టు ఆధ్వర్యంలోనూ, కుటుంబ సభ్యులు శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించి సన్మానం చేశారు.

# దమయంతి చిత్రపటానికి నివాళులర్పించిన డాక్టర్ నాయుడు



**కావలిరూరల్, జూన్30 ప్రభాతవార్త** కావలి పట్టణ 3వ వార్డు వైయస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి మండలి కృష్ణారావు తల్లి మండలి దమయంతి పెద్దకర్మ కావలి భాష్యం స్కూలువద్దగల మన్నెం గోపాలకృష్ణారెడ్డి కళ్యాణమండపం నందు సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజావైద్యులు, కావలి మాజీ మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ యన్.ప్రభాకర్‌నాయుడు పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. అనంతరం ఆమె కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో పేస్ కంప్యూటర్స్ అధినేత శ్రీనివాస్, వైసిపి నాయకులు మాలి, నాయబ్‌రసూల్, తదితరులు పాల్గొన్నారు.

# వైసిపి నాయకులు, కార్యకర్తలతో సమావేశం: కాకాణి పూజిత



**ముత్తుకూరు, జూన్ 30, ప్రభాతవార్త** మండలంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలతో పార్టీకా ర్యా లయం లో సోమవారం మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి కుమార్తె కాకాణి పూజిత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో మాట్లాడుతూ ఎవరూ అధైర్య పడవద్దని మంచి రోజులు వస్తాయని పేర్కొ న్నారు. ఎన్ని కేసులు బనాయించినా నాన్న కడిగిన ముత్యంలా బయటికి వస్తారని, అందరూ ధైర్యంగా ఉండాలని తన తండ్రి తెలిపారని ఆమె కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. పార్టీ సీనియర్ నాయకులు దువ్వూరు విశ్వమోహన్ రెడ్డి, ఎంపిపి గండవరం సుగుణ, సర్పంచులు ప్రతాప్, కృష్ణవేణి, దువ్వూరి తేజా రెడ్డి, గండవరం సూరి, అగ్ని, పాముల శీనయ్య, కట్టా సుబ్రమణ్యం, జమీల్, అశోక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఫిర్యాదులు స్వీకరించిన పోలీస్ అధికారులు



**నెల్లూరు క్రైమ్ జూన్ 30 ప్రభాతవార్త :** జిల్లా యస్‌పి జి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు సోమవారం స్థానిక ఉమేష్‌చంద్ర సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో మొత్తం 74 ఫిర్యాదులు అందినట్లు పోలీసులు తెలిపారు. కొండాపురం పరిధికి చెందిన దివ్యాంగురాలుని మ్యాట్రిమోనీ ద్వారా వెస్ట్ గోదావరికి చెందిన మల్లుల రాజకుమార్ అనే వ్యక్తి పరిచయం చేసుకుని, ప్రేమిస్తున్నానని పెళ్లి చేసుకుంటానని నమ్మించి, మూడు లక్షలు నగదు తీసుకొని ఇప్పుడు పెళ్లి చేసుకోకుండా దూరం పెడుతున్నాడని, నగదు తిరిగి ఇవ్వలేదని విచారించి న్యాయం చేయాలని కోరారు. దగదర్తి పరిధికి చెందిన మహిళ బిట్రగుంట పరిధిలో ఓ డిగ్రీ కళాశాలలో చదువుతున్నట్లు, తెల్లగుంటకు చెందిన బూదురు భరత్ కుమార్ అనే వ్యక్తి వెంటపడుతూ ప్రేమించాలని పెళ్లి చేసుకోవాలని లేదంటే చంపుతానని బెదిరిస్తున్నారని విచారించి న్యాయం చేయాలని కోరారు. వెంకటాచలం పరిధికి చెందినటువంటి మహిళ 2017 లో ప్రేమ వివాహం చేసుకున్నట్లు, ప్రస్తుతం ఇద్దరు పిల్లలు ఉన్నట్లు, తన భర్త వివాహేతర సంబంధం పెట్టుకొని తన బాగోగులు చూసుకోవడం లేదని, అత్తమామలు కూడా పట్టించుకోవడంలేదని అదేవిధంగా రాపూరు పరిధికి చెందినటువంటి మహిళ తన భర్త అత్తమామలు శారీరకంగా మానసికంగా వేధిస్తున్నట్లు, తనని, పిల్లల్ని ఇంటి నుంచి గెంటివేసారని కౌన్సిలింగ్ నిర్వహించి కుటుంబాన్ని చక్కదిద్దాలని కోరారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో టౌన్ డిఎస్పి సింధుప్రియ, మహిళా పోలీస్ స్టేషన్ సిఐ సుబ్బారావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులు రెడ్డి , ఎస్‌బి 2 సిఐ శ్రీనివాసరెడ్డి కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

# రూలర్‌లో వైఎస్‌ఆర్సిపి కనుమరుగు అవుతుందా..?

## స్వాగతించిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి



**నెల్లూరు రూరల్, జూన్ 30, ప్రభాతవార్త** మాజీ కార్పొరేటర్ తురక అనిత, తురక సూరి ఆధ్వర్యంలో 30వ డివిజన్ నుంచి దాదాపు 1000 మంది కార్యకర్తలతో భారీ ప్రదర్శనతో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. జనంతో కిటకిటలాడిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో మాజీ కార్పొరేటర్ తురక అనిత, తురక సూరి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సమక్షంలో తెలుదేశం పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి, పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వారం రోజుల్లో వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి, నెల్లూరు రూరల్ తెలుగుదేశం పార్టీలో భారీ చేరికలు ఉండబోతున్నాయి. ఏకధాటిగా అందరం కలసి నెల్లూరు రూరల్‌లో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేద్దాం. ఎక్కడికక్కడ స్థానిక ప్రజలకు అందుబాటులో ఉందాం. స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులను సమన్వయం చేసుకొని, పూర్తిస్థాయిలో నూతన చేరికలు ప్రోత్సహిస్తాం. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జి, కో క్లస్టర్ ఇంచార్జి, 30, 31 తెలుగుదేశం పార్టీ డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎవరికైనా ఉద్యోగవిరమణ తప్పనిసరి :ఇఇ శ్రీనివాసకుమార్



**అనంతసాగరం, జూన్30, ప్రభాతవార్త:** ప్రభుత్వ ఉద్యోగం చేసే ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరి అని సోమశిల ప్రాజెక్ట్ ఇఇ శ్రీనివాసకుమార్ పేర్కొన్నారు. మండలంలోని సోమశిల ప్రాజెక్టులో సోమవారం 5మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహజంచారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారులు మాట్లాడుతూ సిబ్బంది అందరూ కూడా తమ పనిని బాధ్యతగా చేశారని కొనియాడారు. అద్దగంటి వి.ఎస్ఎస్ సాయిప్రసాద్ సబ్ డివిజన్-1లో సీనియర్ అసిస్టెంట్‌గా ఎంతో కాలంగా బాధ్యతలు చేస్తూ నేడు ఉద్యోగ విరమణ చేయడం చాలా బాధగా ఉందన్నారు. డ్యూటీకి సమయానికి రావడం, ఎప్పుడు పని అప్పుడే చేసుకోవడం ఆయనతర్వాతేనని వారు కొనియాడారు. అనంతరం ఉద్యోగ విరమణ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సాయిప్రసాద్, ఇతర ఉద్యోగులకు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో ప్రాజెక్ట్ చైర్మెన్ వేలూరు కేశవచౌదరి, మండల అభివృద్ధి అధికారి పి.ఐజాక్‌ప్రవీణ్, తహసిల్దార్ జయవర్ధన్‌రెడ్డి, ఎంఇఇ-2 కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రాజెక్ట్ సిబ్బంది, డిఇలు, ఎఇలు, కుటుంబ సభ్యులు అధికారులు పాల్గొన్నారు.




# జెడ్పీ కారుణ్య పత్రాల అందజేత



నెల్లూరు **కలెక్టరేట్, జూన్ 30, ప్రభాతవార్త** జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో కారుణ్య నియామక ఉత్తర్వులను జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ సోమవారం అందజేశారు. జిల్లా ప్రజా పరి షత్ యాజమాన్య పరిధిలో కారుణ్య నియామకాలను ఆఫీస్ అబార్డినేట్లుగా జ్యోతి కొండలరావు, మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఏఎస్ పేట జి చైతన్య ప్రకాష్, జిల్లా ప్రజాపరిషత్, నెల్లూరుకు నియామక ఉత్తర్వులను చైర్ పర్సన్‌ను చేశారు. ఈ కార్యక్రమంలో సీఈఓ మోహన్ రావు, ఆత్మకూరు, కోవూరు జడ్పిటిసి సభ్యులు, జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారులు, పంచాయతీ రాజ్ నాలుగో తరగతి ఉద్యోగస్తుల సంఘం అధ్యక్షులు కే బీమి రెడ్డి పాల్గొన్నారు.

# కార్యదర్శి గెద్ద. రమణమ్మ సేవలు ప్రశంసనీయం



**బుచ్చి జూన్ 30 ప్రభాతవార్త** 39 సంవత్సరాలు గా హార్టికల్చర్ డిపార్టెమెంట్‌లో, పంచాయితీ కార్యదర్శిగా విదినిర్వహణ చేసి ఎంతో మంది ఉన్నతాధికారుల మన్ననలు అందుకున్న గెద్ద . రమణమ్మ సేవలు ప్రశంసనీయమని ఎంపిడిఒ ఎం.నారాయణరెడ్డి ప్రశంసించారు. బుచ్చిరెడ్డిపాళెం ఎంపిడిఒ కార్యాలయం ప్రాంగణంలో రమణమ్మ పదవి విరమణ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఈ సభలో ముఖ్య అతిధిగా పాల్గోన్న ఆయన మాట్లాడుతు రమణమ్మ ఎంతో మందికి ఆదర్శ ప్రాయురాలు అని కొనియాడారు. నేటి తరం కార్యదర్శులు రమణమ్మ లాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కరునా సమయంలో, వరదల సమయంలో ఆమె ప్రజలకు అందించిన సేవలు ఎనలేనివని ప్రశంసించారు. అనంతరం పంచాయితీ కార్యదర్శులు, పలువురు సర్పంచ్‌లు మాట్లాడుతు రమణమ్మ మాగ్రామాలలో పనిచేసినంత కాలం పార్టీలకు అతీతంగా ప్రజలందరికి మంచి సేవలు అందించారని అధికారులు అలాగే ఉండాలని వారు కాంక్షిం చారు. ఈ సందర్భంగా ఆమెకు శాలువాలు కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో డిప్యూటి ఎంపిడిఒ రాధకృష్ణమూర్తి, ఎఒ .మంజులమ్మ, సెక్రటరీలు కావేరి. ఎస్‌డి జలీల్. సిందూర, లక్ష్మీలావణ్య, మేరి, సంగం మండలం సిద్దీపురం సెక్రటరీ శ్రీనివాసులురెడ్డి, పంచాయితీ సెక్రటరీ అక్బర్ , మునులపూడి సర్పంచ్ పత్తి రమణారెడ్డి, పలువురు అధికారులు, సెక్రటరీలు పాల్గోన్నారు.

# మహిళా సంరక్షణ కార్యదర్శుల బదిలీలు



**నెల్లూరు క్రైమ్ జూన్ 30 ప్రభాతవార్త :** జిల్లాలో పనిచేస్తున్న గ్రామ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులు బదిలీలు జిల్లా పోలీసు కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం జిల్లా ఎస్పీ జి కృష్ణ కాంత్ ఆధ్వర్యంలోనిర్వహించారు. ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న దివ్యాంగులు, స్పౌజ్, మెంటల్లీ రిటార్డెడ్ పిల్లలను కలిగి ఉన్న ఉద్యోగులు, మెడికల్ గ్రౌండ్స్ కింద నమోదు చేసుకున్న ఉద్యోగులకు పూర్తి చేసి, చివరగా జనరల్ కేటగిరి వారిని నిర్వహిస్తున్నారు. నేడు పెన్షన్ పంపిణీ ఉన్నందున మిగిలిన జనరల్ కేటగిరి వారికి తదుపరి నిర్వహించడం జరుగుతుందని జిల్లా పోలీస్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ముందుగా జిల్లా వ్యాప్తంగా ఉన్న ఖాళీలను ప్రొజెక్టర్ పై ప్రదర్శింపజేసి ర్యాంక్ ప్రకారం నిబంధనలు అనుసరించి బదిలీ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బదిలీల ప్రక్రియ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా, నిర్దేశిత పద్ధతిలో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ యస్.పి.(అడ్మిన్) సిహెచ్.సౌజన్య, ఏఓ చంద్రమోళి, సంబంధిత డిపిఓ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటింటికి వెళ్దాం, ప్రభుత్వం చేస్తున్న మంచిని వివరిద్దాం



**నెల్లూరు రూరల్, జూన్ 30, ప్రభాతవార్త** జనంకి అందుబాటులో ఉందాం, సంవత్సర కాలంలో మనం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిద్దాం. ప్రజలు మనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుందాం. పార్టీ బాగుంటే మనం బాగుంటాం. పార్టీకి, ప్రజలకు మధ్యలో వారధిగా ఉందాం అని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో క్లస్టర్, కోక్లస్టర్ ఇంచార్జులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్లు, ముఖ్య నాయకులతో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంపై నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. 2వ తేదీ ఉదయం 7 గంటల నుంచి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ప్రారంభమవుతుంది. ఇంటిం టికి వెళ్లి సంవత్సర కాలంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరిద్దామన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో 100కి 100 శాతం మనం గెలిచి తీరుతాం అని అన్నారు.

# ప్రతి ఉద్యోగికి ఉద్యోగవిరమణ సహజం: మాజీ ఎమ్మెల్యే



**అనంతసాగరం, జూన్30, ప్రభాతవార్త:** ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని, విధుల పట్ల అంకితభావంతో విద్యార్థుల భావి, భవిష్యత్తును తీర్చిదిద్దే ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ పొందినా జీవితాంతం విద్యార్థుల నుంచి గౌరవం అదే రీతిలో పొందుతారని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. అనంతసాగరం టిజెఎన్ జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో బయాలజీ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న మెట్టుకూరు సుబ్బారెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో చేసిన మంచి పనులు చిరస్థాయిగా ఉంటాయన్నారు. మెట్టప్రాంతంలో విద్యాభివృద్ధికి తమ కుటుంబం ఎన్నో కార్యక్రమాలను చేసిందని సొంత స్థలాన్ని అందచేసి కృష్ణాపురంలో జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటు చేశామని డిగ్రీ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాల ఇలా ఈప్రాంత విద్యాభివృద్ధికి తన తండ్రి , మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి కృషి చేశారన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించి వారి భవిష్యత్తుకు బంగారుబాట వేసేలా అందరం సమిష్టిగా కృషి చేద్దామన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుడు మెట్టుకూరు సుబ్బారెడ్డి దంపతులను మేకపాటి విక్రమ్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో వైఇసిపి మండల కన్వీనర్ బిజివేముల పిచ్చిరెడ్డి, మండల అధికారులు, ఉపాధ్యాయులు , మెట్టుకూరు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.